శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు

వార్త



## బుచ్చి తహసిల్దారుపై సస్పెన్షన్ వేటు



**బుచ్చి జనవరి 6 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం తహసిల్దారు ప్రమీలాపై సస్పెన్షన్ వేటు పడింది.జిల్లా ఉన్నతాధికారులు సెస్పండ్ చేస్తు ఉత్తర్వులు జారీ చేశారు. మినగల్లుకు చెందిన ఒ రైతు ఫిర్యాదును విచారించిన అనంతరం ఆమెను జిల్లా అధికారులు సస్పెండ్ చేశారు.ఈ వ్యవహారంలో ఇద్దరు కింది స్దాయి అధికారుల పాత్ర కూడా వుందని వారిపైన వేటు పడనుందని తెలిసింది.బుచ్చిరెడ్డిపాళెం తహసిల్దారుగా వచ్చిన ఆరు నెలలోనే ఆమె సస్పెండ్ కావడం విశేషం.బుచ్చిరెడ్డిపాలెం నగరపాలక పంచాయితీకి సంబంధించిన లేవుట్‌లలో కూడా ప్లాట్లు అమ్మకాలు జరిగినట్లు తెలుస్తొ_ంది.దానిపైన కూడా విచారణ చేయనున్నట్లు తెలిసింది.

## శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి సన్నిధిలో ఆరుద్ర నక్షత్రం పూజలు



**బుచ్చి జనవరి 6 ప్రభాతవార్త** పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి జన్మనక్షత్రం అయిన ఆరుద్ర నక్షత్రం పర్వదినం సందర్భంగా శుక్రవారం స్వామి వారికి ప్రత్యేకాభిషేకాలు పూజలు నిర్వహించారు. శ్రీనటరాజస్వామి సమేత శ్రీశివకామసుందరీ అమ్మవారి గ్రామోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. అనంతరం స్వామి వారి రుద్రపాదుకలకు అభిషేకం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. దేవస్దానం చైర్మన్ పుట్టా లక్ష్మీ సుబ్రహ్మణ్యంనాయుడు దంపతులు, కార్యనిర్వహణాధికారి డబ్బుగుంట వెంకటేశ్వర్లు, పాలక మండలి సభ్యులు టి .నందకుమార్, గుమ్మా రఘురామయ్య, ఎక్స్ అఫిషియా సభ్యులు శ్రీశైలం శశిశేఖర్ శర్మ,అర్చకులు వేదపండితులు,ధార్మిక సెక్యూలర్ ఔట్‌సోర్సి ంగ్ సిబ్బంది పాల్గోన్నారు.

## కావలి శివాలయంలో ఘనంగా జరిగిన అన్నాభిషేకం



**కావలి, జనవరి 6 ప్రభాతవార్త** శివుడికి ప్రీతికరమైన ఆరుద్ర నక్షత్రం శుక్రవారం రావడంతో కావలి శివాలయంలో శివ లింగానికి అన్నాభిషేకం కనులవిందుగా సాగింది. ఆలయ అనువంశిక అర్చకులు ఎ.ఆర్.శశిధర్‌గురుకుల్ వేద మంత్రాల మధ్య శివలింగానికి అన్నంతో అభిషేకం చేశారు. ఈ అన్నాభిషేకాన్ని భక్తులు దర్శించుకొని తరించారు.కావలి శివాలయం ఆవరణలో వున్న నటరాజ మందిరాన్ని ప్రత్యేకంగా అలంకరించారు.పూజలు నిర్వహించారు. అనంతరం శివపార్వతుల ఆలయ ఉత్సవం ఘనంగా జరిగింది. భక్తులకు అన్నాభిషేక ప్రసాదాన్ని అందజేశారు.

## ఎస్సీ విద్యార్థులకు దేశంలో ఉత్తమ విద్య

**నెల్లూరుటౌన్, జనవరి 6, ప్రభాతవార్త:** శ్రేష్ట పథకం ద్వారా ఎస్సీ విద్యార్థులకు దేశంలోని ఉత్తమమైన రెసిడెన్షియల్ పాఠశాలల నందు ప్రవేశం కల్పించేందుకు భారత ప్రభుత్వం దరఖాస్తులు కోరుతుందని జిల్లా ఎస్సీ సంక్షేమ మరియు సాధికార అధికారి వై.వెంకటయ్య శుక్రవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం నందు దేశం మొత్తం మీద సీబీఎస్ఈ సిలబస్‌తో నడపబడుతున్న ఉత్తమమైన రెసిడెన్షియల్ పాఠశాలను ఎంపిక చేసి ప్రతి పాఠశాలకు కనీసం పది మంది బాలురు, పది మంది బాలికలకు ప్రవేశం కల్పించడం జరుగుతుందన్నారు. దేశంలోని 3వేల మంది ఎస్సీ బాలబాలికలకు ఈ పథకం ద్వారా ప్రవేశం లభిస్తుందన్నారు. ఇందులో ప్రవేశం కోరు పాఠశాలలు కనీసం ఐదు సంవత్సరాల నుంచి నడుపుతూ పదో తరగతి మరియు 12వ తరగతి నందు 75 శాతం కంటే ఎక్కువ ఉత్తీర్ణత శాతం కలిగి సరిపడా మౌలిక సదుపాయాలు కలిగి 9, 10 తరగతుల యందు కనీసం 10 మంది ఎస్సీ విద్యార్థినీ విద్యార్థులను చేర్చుకునే సదుపాయాలు ఉండాలన్నారు. 2023-24 విద్యాసంవత్సరం నందు శ్రేష్ట పథకం నందు ప్రవేశపరీక్షలు ఏప్రిల్ నెలలో నిర్వహించడం జరుగుతుందని, ఈ ప్రవేశం కొరకు భారత ప్రభుత్వ మినిస్టరీ ఆఫ్ కౌన్సిల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్ శాఖ వారి ఇ అనుధాన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఎస్సీ బాలబాలికలు ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదువుతూ ఉండాలని, విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2.5 లక్షల లోపు ఉండాలని, 9వ తరగతిలో ప్రవేశం కొరకు పూర్వపు సంవత్సరం 8వ తరగతి, 11వ తరగతిలో ప్రవేశం కొరకు పూర్వపు సంవత్సరం 10వ తరగతి పరీక్షలు రాసి ఉండాలని ఆయన పేర్కొన్నారు. దరఖాస్తు చేసే విద్యార్థులు ప్రీ మెట్రిక్ ఉపకారవేతనాలు పొంది ఉండకూడదని ఆయన స్పష్టం చేశారు. శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో సీబీఎస్ఈ సిలబస్‌తో జరుగుతున్న రెసిడెన్షియల్ స్కూల్ యాజమాన్యాలు ఈ పథకం నందు భారత ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

## అష్టలక్ష్మీఆలయంలో లక్ష తులసీదళ అర్చన




**నెల్లూరు,జనవరి6 ప్రభాతవార్త-విద్య** ధనుర్మాసం పురస్కరించుకుని శుక్రవారం పౌర్ణమి సందర్భంగా నగరంలోని స్థానిక కొండాయపాలె ం సుజాతమ్మకాలనీలోని శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ వారి అవదూత దత్తపీఠం నెల్లూరుశాఖ అష్టలక్ష్మీ ఆలయం(కృష్ణమందిరం)లో లక్ష తులసీధళ అర్చనను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం 10గంటలనుండి ప్రారంభమైన ఈ పూజా కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని 400కెజీల తులసి ధళాలతో 7 లక్షలపైగా నామజపంతో ఈ లక్ష తులసి అర్చనను వైభవోపేతంగా చేపటా ్టరు. అనంతరం ఆలయ నిర్వాహకులు రుద్రహోమం, అష్టలక్ష్మిహోమాలను నిర్వహించి భక్తులకు తీర్థప్రసాధాలను వితరణ చేశారు. ఈ కార ్యక్రమం దత్తపీఠం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిజంలో విలువలు సన్నగిల్లాయి



**కందుకూరు,జనవరి6,ప్రభాతవార్త** నేటి కాలంలో జర్నలిజంలో విలువలు సన్నగిల్లాయని ఏపీ ప్రస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు.శుక్రవారం మధ్యాహ్నం కందుకూరు పామూరు రోడ్డులో వారం క్రితం చంద్రబాబు పర్యటనలో జరిగిన తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన బాధితుల ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా కొన్ని పత్రికల గురించి ఆయన వ్యాఖ్యానించారు.జర్నలిజం విలువలు వారి మూలంగా పోతున్నట్లు చెప్పారు.చంద్రబాబు షోలో డ్రోన్ కెమెరాల కోసం ప్రాణాలు పోయినట్లు పేర్కొన్నారు.పోలీసుల వైఫల్యం ఏమి లేదని ఆయన చెప్పుకొచ్చారు. పాత్రికేయులు అడిగిన సూటి ప్రశ్నలకు ఆయన సమాదానం దాటవేశారు.అసలు విషయాలు పక్కనపెట్టి పత్రికల పై విరుచుకుపడ్డారు.చనిపోయిన జర్నలిస్టులకు ఏమి సహాయం చేశారని ప్రశ్నిస్తే మరోసారి సమాదానం చెబుతానంటూ దాటవేశారు.పాత్రికేయుల సమస్యలపై ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కనీసం అక్రిడేషన్లు కూడా ఇవ్వడంలో కూడా జాప్యం జరుగుతోందని పలువురు పాత్రికేయులు ఆయన దృష్టికి తీసుకురాగా సమాధానం ఇవ్వకుండా వెనక్కి వెళ్లారు.స్వయం ప్రతిపత్తి కలిగిన పదవిలో ఉన్న ఆయను నిర్వహించే శాఖ గురించి మాట్లాడకుండా ప్రతిపక్ష పార్టీల గురించి విమర్శించి వెళ్లిపోవడంపై స్ధానిక పలువురు ఆశ్చర్యం పరిచారు.

## కోనలో గోధా దేవికి ధనుర్మాస పూజలు



**పెంచలకోన(రాపూరు), జనవరి 06 ప్రభాతవార్త:** పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో ధనుర్మాసంసందర్భంగా శ్రీ ఆధిలక్ష్మీ అమ్మవారికి శుక్రవారం విశేష పూజలు, అలంకారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని గోధా దేవిగా అలంకరించి వేదపండితులు మంత్రోచ్ఛరణల మధ్య ఆస్థాన సేవ, కోనలో క్షేత్రోత్సవం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు గోధా దేవిగా వున్న ఆధిలక్ష్మీ అమ్మవారిని దర్శించుకోని పూజలు నిర్వహించారు.

# గ్రూపు-1 స్క్రీనింగ్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేయండి



**నెల్లూరు అర్బన్, జనవరి 6, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో జిల్లాలో ఈ నెల8వ తేదీన జరగబోయే గ్రూపు-1 స్క్రీనింగ్ పరీక్షల నిర్వహణ విషయంపై శుక్రవారం ఉదయం స్థానిక కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఎపి పబ్లిక్ సర్వీస్ కమిషన్ అసిస్టెంట్ సెక్రటరీ జి.వసంతకుమార్, లైజనింగ్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించి పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నుడా వైస్‌చైర్మన్ టి.బాపిరెడ్డి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్.చక్రధర్‌బాబు ఆదేశాల మేరకు జిల్లాలో ఈ నెల8వ తేదీన నిర్వహించబోయే గ్రూపు-1 స్క్రీనింగ్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై ఈ రోజు లైజనింగ్ అధికారులు చీఫ్ సూపరిటెండెంట్లతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. ఎంతో ప్రాముఖ్యత ఉన్న పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల్లో ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లతో పరీక్షలు సజావుగా ప్రశాంత వాతావరణంలో నడిపించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. పరీక్షల నిర్వహణకు నియమించిన లైజనింగ్ అధికారులు పరీక్షా సమయం అంతా ఆయూ పరీక్షలు రాసే గదులను పర్యవేక్షించాలన్నారు. జిల్లా కేంద్రంలో 16 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ పరీక్షలకు 6045 మంది అభ్యర్థులు హాజరు కానున్నారన్నారు. అభ్యర్థుల సౌకర్యార్థం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. పరీక్షా కేంద్రం సమీపంలో జెరాక్స్, ఆన్‌లైన్ కేంద్రాలను మూసివేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ప్రశ్నాపత్రాలు, ఓఎంఆర్ షీట్లు, ఇతర పరీక్షా సామగ్రి జిల్లాకు చేరిన నాటి నుంచి పోలీసు బందోబస్తుతో భద్రపరచాలని, అదేవిధంగా పరీక్షల అనంతరం సంబంధిత సమాధాన పత్రాలను పూర్తి బందోబస్తుతో ట్రెజరరీకి చేర్చాలన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి సర్వీస్ కమిషన్ సూచించిన మార్గదర్శకాలను లైజన్ అధికారులు, సూపరింటెండెంట్లు ఒకటికి రెండు సార్లు పూర్తి పరిశీలన చేయాలన్నారు. సంబంధిత పరీక్షా కేంద్రాలను ముందుగానే సంబంధిత లైజన్ అధికారులు పరిశీలించి అక్కడ ఏర్పాట్లను చూడడంతో పాటు చీఫ్ సూపరింటెండెంట్లు ఇన్విజిలేటర్లతో ముందుగా సమావేశం నిర్వహించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. గర్భిణీలు, అంధులు, విభిన్న ప్రతిభావంతుల అభ్యర్థులకు పరీక్షా కేంద్రంలోని భవనం కింది అంతస్తులోనే పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. అంధత్వం, రెండు చేతులకు వైకల్యం, మస్తిష్క పక్షపాతం గల అభ్యర్థులకు స్క్రయిబర్లను అనుమతించడం జరుగుతుందని, పరీక్షా కేంద్రంలోకి ఎలాంటి మొబైల్ గానీ, బ్లూటూత్, స్మార్ట్‌వాచ్, క్యాలిక్యులేటర్ ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించబోరని ఆయన స్పష్టం చేశారు. వీటిని గుర్తించేందుకు పరీక్షా కేంద్రం వెలుపలే స్క్రీనింగ్ చేసేందుకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. సంబంధిత స్క్రయిబర్ ఇంటర్మీడియట్ లోపు అభ్యర్థి అయి ఉండాలన్నారు. వైట్‌నర్, మార్కర్, ఎరేజర్లను వినియోగించినా ఆ సమాధాన పత్రం చెల్లదని తెలిపారు. అభ్యర్థులు బ్లూ లేదా బ్లాక్ పాయింట్ బాల్‌పెన్‌ను తెచ్చుకోవాలన్నారు. ప్రశ్నాపత్రం బుక్‌లెట్‌పై నిర్దేశించిన ప్రాంతంలో తమ రిజిస్టరు నెంబరు నమోదు చేయాలన్నారు. ఓఎంఆర్ షీట్‌కు సంబంధించి ఒరిజినల్ ఓఎంఆర్ షీట్‌ను పరీక్ష అనంతరం అభ్యర్థి నుంచి ఇన్విజిలేటర్ సేకరించాలి. అలాగే డూప్లికేట్ ఓఎంఆర్ షీట్‌ను, ప్రశ్నాపత్రాన్ని అభ్యర్థులు తీసుకెళ్లవచ్చన్నారు. ఇన్విజిలేటర్లు, లైజన్ ఆఫీసర్లు, సర్వీస్ కమిషన్ ప్రశ్నించిన ప్రకారం సంబంధించిన పత్రాలపై సంతకాలు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు రాసే వారికి అవసరమైన అన్ని వసతులు సక్రమంగా ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద కోవిడ్ ప్రోటోకాల్ అమలు జరిగేలా సంబంధిత లైజనింగ్ అధికారులు చీఫ్ సూపరింటెండెంట్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మాస్క్‌లు, శానిటైజర్లు అందుబాటులో ఉంచాలన్నారు. మంచినీరు, ప్రాథమిక చికిత్స కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా పరీక్షా సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణ సమయంలో ఆయా కేంద్రాల వద్కద కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పేపర్ -1 పరీక్ష ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు జరుగుతుందని, పేపర్ -2 మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించబడునన్నారు. ఉదయం జరిగే పరీక్షకు అభ్యర్థులు 9గంటలకు చేరుకోవాలని, 9:45 గంటల తరువాత అనుమతించబడరని, మధ్యాహ్నం జరిగే పరీక్షకు అభ్యర్థులు 1 గంటలకు చేరుకోవాలని, 1:45 గంటల తరువాత అనుమతించబడరన్నారు. పరీక్షా సమయం పూర్తయ్యే వరకు అభ్యర్థులకు బయటికి వెళ్లేందుకు అనుమతించబడరు. పరీక్షా కేంద్రానికి వచ్చే ముందు హాల్ టిక్కెట్లతో పాటు ప్రభుత్వం గుర్తించిన ఏదైనా ఒక ఒరిజినల్ ఫోటో గుర్తింపు కార్డు వెంట తీసుకురావాలన్నారు. పరీక్షల నిర్వహణలో భాగంగా లైజనింగ్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు ఏపీపీఎస్సీ మార్గదర్శకాలకు అనుగుణంగా చేపట్టాల్సిన విధులను ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అసిస్టెంట్ సెక్రటరీ జి.వసంతకుమార్, సెక్షన్ ఆఫీసర్ పి.ధిల్లేశ్వరరావు ,బాలరాజు సవివరంగా వివరించారు. 16 పరీక్షా కేంద్రాల లైజనింగ్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# పొగాకు పంటను పరిశీలించిన బోర్డు అధికారులు



**మర్రిపాడు,జనవరి6ప్రభాతవార్త:** మర్రిపాడు మండలం డిసిపల్లి పొగాకుబోర్డు అధికారులు, కంపెనీల ప్రతినిధుల , శా స్త్రవేత్తలు, రైతులు కలిసి శుక్రవారం మండలంలోని పొగాకు పంటను పరిశీలించారు. డిసిపల్లి పొగాకు బోర్డు పరిధిలోని గుండెమడకల, డిసిపల్లి, భైరవరం, నందవరం గ్రామాలను సందర్శించి పొగాకు పంటలను, క్యూరింగ్‌ను పరిశీలించి పొగాకు రైతులకు సలహాలు ఇచ్చారు. ఈసందర్భంగా పొగాకు బోర్డు రీజనల్ ఆఫీస్ ఆక్షన్ సూపర్నెంట్ సిద్ధిరాజు మాట్లాడుతూ సిటిఆర్ఐ సిఫార్సు చేసిన మందులను తగిన మోతాదులో వాడాలని, పొగాకులో మందులు ఎక్కువగా వాడడం వలన పురుగుమందుల అవశేషాలు నిలబడే ప్రమాదం ఉందన్నారు. లింగాకర్షకబుట్టలు వాడడం, పసుపు జిగురు అట్టలు వాడడం, బతి మొక్కల వంటి ఎర పంటలను వేసుకోవాలన్నారు. పూర్తిగా పక్వానికి వచ్చిన లేత గోధుమరంగు ఆకులనే రేల్చాలని, పచ్చిఆకును నేలపై కాకుండా తార్పాలిన్‌పై దించి అల్లాలని, పచ్చి ఆకులో గడ్డి, ఇతన అన్యపదార్థాలు లేకుండా శుభ్రత పాటించాలని, బ్యారన్‌లో ఇనుపజల్లి అమర్చుకోవాలన్నారు. తప్పనిసరిగా క్యోరోమీటర్‌వాడాలన్నారు. ఈకార్యక్రమంలో డిసిపల్లి పొగాకుబోర్డు వేలం కేంద్ర నిర్వహణాధికారి రాజశేఖర్, ఐటిసి మేనేజర్ జి.వెంకట్రావ్, పిఎస్ఎస్ మేనేజర్ ఎ.రామాంజనేయులు, జిపిఐమేనేజర్ ఆంజనేయులు, బోర్డు సిబ్బంది , రైతులు పాల్గొన్నారు.

# విద్యారంగంలో కావలి జవహర్ భారతి ప్రత్యేకతను సంతరించుకుంది



**కావలి, జనవరి 6 ప్రభాతవార్త** విద్యారంగంలో కావలి జవహర్ భారతి విద్యాసంస్థలు ప్రత్యేకతను సంతరించుకున్నాయని రాష్ట్ర ప్రెస్ అకాడమి చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం కావలి జవహర్ భారతి జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థుల ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. విశ్వోదయ, జవహర్ భారతి విద్యాసంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ దొడ్ల రామచంద్రారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడారు. ఎంతో ఘన చరిత్ర కల్గిన కావలి జవహర్ భారతి విద్యాసంస్థల్ని సందర్శించడం చాలా సంతోషంగా వుందన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ పురస్కారం ఈ కళాశాలకు లభించడం ఎంతైనా అభినందనీయమన్నారు. నిరుపేదలకు విద్య దూరంకాకూడదన్న సంకల్పంతో డాక్టర్ దొడ్ల రామచంద్రారెడ్డి ఆనాడు వేసిన బీజం మహావృక్షంగా మారి ఎందరికో విద్యాదానం చేస్తుందన్నారు. విద్య, వైద్య రంగాలకు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఎంతో ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలకు శ్రీకారం చుట్టారని ఆయన గుర్తు చేశారు. ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. మన బడి, నాడు-నేడు పథకాలతో కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు సియం మార్చి వేశారన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలని తెలిపారు. తిరుపతి జిల్లా తడ వద్ద గల శ్రీసిటీ పారిశ్రామికవాడను విద్యార్థులందరూ సందర్శించాలన్నారు.అక్కడ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందాలన్నారు. వివిధ దేశాలకు చెందిన పరిశ్రమలు శ్రీసిటీలో వున్నాయన్నారు. వీటన్నింటిని పరిశీలించి అవగాహన పెంపొందించుకోవాలన్నారు. విశ్వోదయ, జవహర్ భారతి రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వంద ఎకరాలు స్థలంలో బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల, రెండు ఇంజనీరింగ్ కళాశాలలతో జవహర్ భారతి విద్యాసంస్థలు విద్యార్థులకు సేవలందిస్తున్నాయన్నారు.తమ తండ్రి దొడ్ల రామచంద్రారెడ్డి బాటలో పయనిస్తూ నిరుపేదలకు మెరుగైన విద్య అందిస్తున్నామన్నారు.110 దేశాలలో జవహర్ విద్యాసంస్థల విద్యార్థులు వివిధ రంగాలలో పనిచేస్తున్నారన్నారు. ఇది తమ కళాశాలలకు ఎంతో గర్వకారణమన్నారు. అనంతరం ప్రెస్ అకాడమి చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. జిల్లా సమాచార, పౌరసంబంధాల అధికారి వెంకటేశ్వర ప్రసాద్, ప్రిన్సిపాల్ సన్ని శామ్యూల్‌రాజ్, ఐసి మెంబర్ కూనం తాతిరెడ్డి,ఫిజికల్ డైరెక్టర్ మాల్యాద్రి, తెలుగు అధ్యాపకురాలు సీతాకుమారి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

**సమాజంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో విలువైనది...**

సమాజంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో విలువైనదని, ఎటువంటి పక్షపాత ధోరణి లేకుండా వాస్తవాలు ప్రతిబించేలా వార్తలు రాయాలని రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయనను కావలిలో కలిసిన జర్నలిస్టులతో మాట్లాడారు. జర్నలిజం పేరుతో వ్యక్తిగత విధ్వంసకర దాడి సరికాదన్నారు. సమాజంలో స్వచ్ఛందంగా సేవ చేసే సేవకులు జర్నలిస్టులు అని కొనియాడారు.కొంతమంది జర్నలిస్టులు తమకు జీతాలు లేవని, ప్రభుత్వ పథకాలు అందడం లేదని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. జీతాలు ఇవ్వకపోతే ఎందుకు పనిచేస్తున్నారని ఆయన ఎదురుదాడి చేశారు. మీ సమస్యలు వుంటే మీ యాజమాన్యాన్ని అడగాలని తెలిపారు.

## సిహెచ్‌సిని తనిఖి చేసిన డిసిటిఒ



**వింజమూరు జనవరి** వింజమూరులోని సామాజిక ఆరోగ్యకేంద్రాని న్ని శుక్రవారం జిల్లా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిసిటిఒ కె .విష్ణురావు ఆద్వర్యంలో విజిలెన్స్ బృందం ఆసుపత్రిలో తనిఖీలు నిర్వహించారు.ముందుగా ఆసుపత్రిలో మెడికల్‌షాపులోని మందుల రిజిష్టర్లను పరిశీలించి స్టాక్ రూంలోని నిలువలను పరిశీలించారు. అలాగే రోగులకు అందుతున్న వైద్యసేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా వైద్య ఆరోగ్యశాఖలో సమూల మార్పులను తీసుకొని రావడం జరిగిందని అన్నారు. దానికి అణుగుణంగా సిబ్బంది విధులు నిర్వర్తిస్తు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు.ఈ పరిశీలనలో వినియోగంలోకి రాని ఎక్సెరే ప్లాంటు, మార్చురిరూం, డెంటల్ పరికాలు,అలాగే పలు సమస్యలను గుర్తించారు.ఈ కార ్యక్రమంలోఎస్ఆర్ఒ గోపాలకృష్ణా,వెంకటరెడ్డి,గిరిధర్‌రెడ్డి, స్దానిక వైద్యలు,సిబ్బంది పాల్గోన్నారు.

## మతిస్దిమితం లేని బాలికను బంధించి చిత్రహింసలు



**బుచ్చి జనవరి 6 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంలోని కోనేటి మిట్టలో మతిస్దిమితంలేని ఒ యువతిని లంకేశ్వరరావు అనే వ్యక్తి బంధించి చిత్రహింసలు పెట్టాడు.విషయం తెలిసిన వెంటనే ఐసిడిఎస్ అధికారులు,బుచ్చిరెడ్డిపాళెం సిఐ కోటేశ్వరరావు,ఎస్ఐ వీర ప్రతాప్ సంఘటన స్దలాన్ని పరిశీలించారు. ఐసిడిఎస్ అధికారులు విచారించగా లంకేశ్వరరావు గత రెండు నెలల నుండి ఆయువతిని ఇంట్లో బందించి తమ బందువుల అమ్మాయి అని చెబుతున్నాడని వారు తెలిపారు.

అయితే ఐసిడిఎస్ అధికారులు వెళ్లి తలుపులు వేసి వున్న ఇంట్లో ఉన్న ఆ యువతిని కిటికిలో నుండి విచారించగా ఆమె తనది ఆత్మకూరు అని తెలిపింది.

సిఐ కోటేశ్వరరావు,అంగన్ వాడీ సూపర్‌వైజర్ ఆ యువతిని బయటకు తీసుకొని వచ్చి ప్రశాంతంగా ఆమెను వివరాలు అడిగి తెలుసుకున్నారు. లంకేశ్వరరావును అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆయువతకి వైద్యపరీక్షలు చేయించి నెల్లూరులోని మహిళా ప్రాంగణానికి తరలించారు.

## వైభవంగా పుష్య మాస పౌర్ణమి గరుడ సేవ



**బిట్రగుంట, జనవరి 6 (ప్రభాతవార్త):** బోగోలు మండలం కొండ బిట్రగుంటలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం పుష్యమాస పౌర్ణమి గరుడ సేవను నిర్వహించారు. శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామిని గరుడ వాహనంలో ఆలయం చుట్టూ గోవిందనామ స్మరణలో ఊరేగింపు నిర్వహించి భక్తులకు దర్శింపజేశారు.అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీరామమూర్తిరెడ్డి, ఇవో రాధాకృష్ణలు మాట్లాడుతూ ఇకపై ప్రతి పౌర్ణమికి దాతల సహకారంతో గరుడ సేవ నిర్వహించడం జరుగుతుందని జిల్లా నలుమూలల నుంచి వచ్చే భక్తులు ఈ ఉత్సవాన్ని తిలకించాలని కోరారు.

## వీధిలైట్లు వెలిగించండి

**అనంతసాగరం, జనవరి6(ప్రభాతవార్త):** అనంతసాగరం మండలం సోమశిల ప్రాజెక్టు కాలనీలో వీధిదీపాలు లేక కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. గత కొన్ని నెలలుగా వీధిదీపాలు వెలగకపోవడంతో వీధుల్లో నడవాలంటే భయం వేస్తుందని, రాత్రి సమయంలో విషసర్పాలు తిరుగుతున్నాయన్నారు. కావున సంబంధిత అధికారులు వెంటనే వీధి దీపాలు వేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

## టిడిపి నేతల నిరసన



**కందుకూరు, జనవరి6,ప్రభాతవార్త:** ప్రతిపక్షాలను,ప్రజలను అణిచివేసేందుకు జీవో నెం1 ప్రభుత్వం తీసుకుని వచ్చిందని తెలుగుదేశం నేతలు మండి పడ్డారు.ఇందుకు నిరసన వ్యక్తం చేశారు.ప్రభుత్వం తెచ్చిన చీకటి జీవోను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.శుక్రవారం టిడిపి జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్,ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు.టిడిపి కార్యాలయం నుంచి అంబేద్కర్ బొమ్మ వరకు వెళ్లి ఆయనకు వినతిపత్రం అందించారు.అనంతరం జీవో కాపీలను దగ్ధం చేశారు.ఈ సందర్భంగా అజీజ్ మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రజలకు శుభాకాంక్షలు తెలపాల్సిన ముఖ్యమంత్రి అందుకు భిన్నంగా ప్రజాస్వామ్య విరుద్ధంగా స్వేచ్ఛ హక్కును హరించే జీవోను తీసుకుని రావడం మూర్ఖత్వమని విమర్శించారు. రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం నడుస్తోందనిఆరోపించారు. 168సంవత్సరాల ముందు బ్రిటీష్ హయాంలో స్వాతంత్ర సమరయోధులు పోరాటాన్ని అడ్డుకునే సమయంలో బ్రిటీష్ ప్రభుత్వం ఉపయోగించిన జీవోను ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి ఉపయోగించారని ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు.బ్రిటీషర్లు తెచ్చిన ఈ జీవో మన రాష్ట్రంలో అప్పటిలోనే అమలుచేయలేదని గుర్తు చేశారు.అటువంటి నల్లచట్టం తెచ్చి ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారని విమర్శించారు. తక్షణమే ఈ జీవోను రద్దు చేయాలని పార్లమెంట్ ఉపాధ్యక్షులు ఇంటూరి రాజేష్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కావలి టిడిపి ఇన్‌చార్జి ఎం.సుబ్బానాయుడు,ఎమ్మెల్సీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్, స్థానిక పార్టీ నాయకులు వేముల గోపాల్‌రావు,దామా మల్లేశ్వరరావు,జనిగర్ల నాగరాజు, సుబ్బారావు, పలువురు నేతలు హాజరయ్యారు.

## చంద్రశేఖర్‌రెడ్డికి మద్దతు తెలిపిన "ఎస్ఎల్‌టిపి"



**నెల్లూరు,జనవరి6 ప్రభాతవార్త-విద్య:** వైకాపా తూర్పురాయలసీమ ఉపాద్యాయ ఎమ్మెల్సీ అభ్యర్ధి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి స్టేట్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఎస్ఎల్‌టిపి) వారి సంపూర ్ణమద్దతును ప్రకటించింది. శుక్రవారం నగరంలో నిర్వహించిన అసోసియేషన్ కార్యక్రమంలో రాష్ట్రనాయకులు ఈ మేరకు వారి నిర్ణయాన్ని ప్రకటించారు. అనంతరం ఎమ్మెల్సీ అభ్యర్ధి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని మర్యాధపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర అద్యక్షులు కొండయ్య, రాష్ట్ర ప్రధానకార్యదర్శి శివానందలు మాట్లాడుతు రా ష్ట్ర వ్యాప్తంగా ఉన్న 10214మంది లాంగ్వేజ్ పండిట్లకు స్కూల్ అసిస్టెంట్స్‌గా పదోన్నతులు కల్పించటంలో తమ ఎనలేని కృషచేశామన్నారు. ఎంతో నమ్మకం విశ్వాసం కలిగినతమ అసోసియేషన్ మద్దతును అత్యధిక సభ్యుల ఆమెదం మేరకు చంద్రశేఖర్‌రెడ్డికి ఇవ్వటం జరిగిందన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్ధి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతు తనపై నమ్మకంతో మద్దతు తెలిపిన ఎస్ఎల్‌టిపి కు ధన్యవాదాలు తెలిపారు. అలాగే వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెల్లి పర్కిష్కరించేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై జిల్లా పశువైద్యాధికారి సమీక్ష



**రాపూరు, జనవరి 06 ప్రభాతవార్త:** పశుసంవర్ధక శాఖలో ప్రభుత్వ పధకాల పనితీరుపై శుక్రవారం జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ బి.మహేశ్వరుడు రాపూరు పశుసంవర్ధక వైద్యశాలలో సిబ్బంది సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.బి.కెల పనితీరుమీద పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకులు డాక్టర్, బి. సురేష్ తగు సూచనలు చేశారు. పశువులలో లింగ నిర్ధారణ, దూడలు పుట్టువిధానంపై డి,ఆర్.డి.ఎ పర్యవేక్షక అధికారి డా. టి.సోమయ్య, తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్ధక శాఖాధికారిని వైద్య సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యం.వి. అనిల్ కుమార్, రాపూరు,సైదాపురం పశుసంవర్ధక వైద్యులు డాక్టర్ బి. ప్రసాద్, డాక్టర్ జె. నాగార్జున, డాక్టర్ ఎస్.సుప్రజ ఇతర సిబ్బంది వున్నారు.

## ప్రోహిబిషన్ అండ్ ఏక్సైజ్ కార్యలయం పోదలకూరుకు తరలింపు

**రాపూరు, జనవరి 06 ప్రభాతవార్త:** రాపూరు కేంద్రంగా వున్న ప్రోహిబిషన్ అండ్ ఏక్సైజ్ కార్యలయాన్ని పోదలకూరుకు తరలించినట్లు సెబ్ఇనస్పెక్టర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సెబ్ కార్యలయం పరిధిలో రాపూరు, సైదాపురం, చేజర్ల,పోదలకూరుమండాలు వుంటాయిని తెలిపారు. పోదలకూరులోని సెబ్ స్టేషన్ ఫ్లాట్ నెం.67, శ్రీనివాస నగర్, తాజ్ బిరియాని హౌస్ ప్రక్కన, పోదలకూరులో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సర్కిల్ పరిధిలో పేకాట, గుట్కా విక్రయాలు, ఇతర రాష్ట మద్యం విక్రయాలు, సారా తయారి వంటివి జరిగితే టోల్ ఫ్రీ నెం. 14,500 కు సమాచారం అందించాలని స్టేషన్ ఇన్‌చార్జ్ ఇనస్పెక్టర్ ఎస్.ప్రభాకర్ ఆప్రకటనలో కోరారు.

## పోలీస్ స్టేషన్ల ముందు ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవు

**కావలి, జనవరి 6 ప్రభాతవార్త:** కావలి పట్టణ వన్ టౌన్ పోలీస్ స్టేషన్, రైతు బజారు ముందు, తదితర ప్రాంతాలలో అడ్డంగా తోపుడు బండ్లు, కూరగాయల వ్యాపారస్తులు పెట్టకూడదని కావలి డిఎస్పీ వెంకట రమణ హెచ్చరికలు చేశారు. శుక్రవారం డిఎస్పీ స్వయంగా ఈ ప్రాంతాలను పరిశీలించారు. పోలీస్ అధికారులను పిలిపించి ట్రాఫిక్‌పై చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తోపుడు బండ్లు, కూరగాయల వ్యాపారస్తులు పోలీస్ స్టేషన్ల ముందు పెట్టకుండా చూడాలని పోలీసులను ఆదేశించారు.



## ముమ్మాటికీ పోలీసుల వైఫల్యమే ధ్వజమెత్తిన టిడిపి నేతలు



**కందుకూరు,జనవరి6,ప్రభాతవార్త:** కందుకూరు ఘటనలో ప్రభుత్వ పాత్రపై అనుమానాలు ఉన్నాయని శుక్రవారం జరిగిన సామావేశంలో తెలుగుదేశం నేతలు ఆరోపించారు.ఇది ముమ్మాటికీ పోలీసుల వైఫల్యమేనని స్పష్టం చేశారు.తెలుగుదేశం నేతలు ఇంటూరినాగేశ్వరరావు,రాజేష్‌ను గురువారం సాయంత్రం హైదరాబాద్‌లో పోలీసులు మఫ్టీలో వెళ్లి అదుపులోకి తీసుకోవడం అన్యాయమన్నారు.డ్రస్ లేకుండా కార్యాలయాల్లోకి జొరబడి తీసుకుని రావడం అవివేకమన్నారు.వారి వైఫల్యాన్నితెలుగుదేశం నేతలపై రుద్దడం దారుణమన్నారు.అరెస్టుకు సంబంధించి టిడిపి నేతలకు మద్దతుగా ప్రకాశం,నెల్లూరు జిల్లాకు చెందిన శాసనసభ్యులు,టిడిపి నేతలు పరామర్శించి టిడిపి కార్యాలయంలో పాత్రికేయులసమావేశంలో పాల్గొన్నారు.వైసీపి నేతలు పోలీసులను నటించమంటే జీవిస్తున్నారని కొండేపి,అద్దంకి శాసనసభ్యులు,డోలా బాలాంజనేయులు విమర్శించారు.అసలు ఎసీ,ఎస్టీ అట్రాసిటీని ఎలా నమోదు చేశారని ప్రశ్నించారు. దళితుల మీద జగన్‌మోహన్‌రెడ్డికి ప్రేమ ఉంటే వారి పథకాలను ఎందుకు నిలిపివేశారని ప్రశ్నించారు.ఎంతో మంది దళితులు మూడేళ్లలో జగన్ మోహన్‌రెడ్డి వికృతి చేస్టలకు ప్రాణాలు పోగొట్టుకున్నట్లు పేర్కొన్నారు.నెల్లూరు పార్టీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ స్ధానిక పోలీసులు భద్రత కల్పించడంలో విఫలం చెందారని తెలిపారు.30-40వేల మంది హాజరవుతారని పోలీసులకు తెలిసినా ఎందుకు భద్రత కల్పించలేదని ప్రశ్నించారు.పైగాబాధితులైన టిడిపి వారిపై తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేశారని న్యాయస్ధానంలో న్యాయం జరిగినట్లు చెప్పారు. పోలీసులపై కూడా ప్రైవేటు కేసులు వేస్తామని ప్రకటించారు.ఈ సమావేశంలో టిడిపి నేతలు దామచర్ల సత్య నారాయణ,కంచర్ల శ్రీకాంత్,కావలి టిడిపి ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడు,జన్నీ రమణయ్య,రాజా నాయుడు,పెంచలయ్య,మేకల నరేంద్రర్‌రెడ్డి,జలదంకి సుధాకర్,సాబీర్‌ఖాన్,చీరాల,సంతనూతలపాడు టిడిపి ఇన్‌చార్జులు ఎంఎం కొండయ్య,బిఎన్ విజయకుమార్ తదితరులు హాజరైయ్యారు.

## పోలీస్ అనుమతి లేనిదే సభలు, ర్యాలీలు నిర్వహించకూడదు



**కావలి, జనవరి 6 ప్రభాతవార్త :** కందుకూరు, గుంటూరు ప్రాంతాలలో చంద్రబాబు సభలలో జరిగిన తొక్కిసలాటలో కొంతమంది మృతి చెందడంతో ప్రభుత్వం జీవో నెం.1ని విడుదల చేసిందని కావలి డిఎస్పీ వెంకట రమణ తెలిపారు. శుక్రవారం కావలి డిఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో డిఎస్పీ మాట్లాడారు. పోలీస్ అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించకూడదని ఆయన తెలిపారు. పోలీస్ ఆంక్షల్ని విస్మరించి కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు గైకొనడం జరుగుతుందని డిఎస్పీ హెచ్చరికలు చేశారు. మరి ముఖ్యంగా కావలి ట్రంకురోడ్డులో ట్రాఫిక్ సమస్య తలెత్తేలా ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించకూడదన్నారు. అందుచేత ప్రతి ఒక్కరు ప్రభుత్వం విడుదల చేసిన జీవోను అనుసరించి పోలీస్ అనుమతులు లేకుండా ఎటువంటి ర్యాలీలు, రోడ్‌షోలు, సభలు, సమావేశాలు నిర్వహించకూడదన్నారు. కావలి పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో రాజకీయ పార్టీల నేతలు, పలు సంఘాల నేతలు పోలీసులకు సహకరించాలని కోరారు. సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందాలు, పేకాట ఆటలు నిర్వహిస్తే కఠిన చర్యలు గైకొనడం జరుగుతుందని డిఎస్పీ హెచ్చరికలు చేశారు. పట్టణంలో సింగిల్ నెంబర్ లాటరీ,క్రికెట్ బెట్టింగ్‌రాయుళ్లపై పోలీస్ నిఘా వుంటుందన్నారు. వీటిని రూపుమాపుతామన్నారు. ఈ ఆటల నిర్వాహకులపై పోలీస్ ఉక్కుపాదం మోపుతుందన్నారు. అలాగే పట్టణంలో సిసి కెమెరాల వ్యవస్థను పునరుద్దరిస్తామని తద్వారా ప్రమాదాలను నివారిస్తామన్నారు.

## పేదలపాలిటి పెన్నిధి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి



**ఇందుకూరుపేట జనవరి 6 ప్రభాతవార్త:** ఇందుకూరుపేట మండలం గంగపట్నం గ్రామంలో గడగడపకు కార్యక్రమంలో కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పాల్గొన్నారు .శుక్రవారం గంగపట్నం లోని గడగడపకు కార్యక్రమాన్ని నిర్వహించారు.గంగపట్నం పల్లిపాళెంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతు నెల్లూరు జిల్లాలో కొత్తగా 11 వేలా 618 పెన్షన్లు మంజూరు కాగా కోవూరు నియోజకవర్గంలో 15 వందల 57 మందికి 43 లక్షలా 24 వేల రూపాయాలు పంపీణి చేసినట్లు తెలిపారు. ఇందులోభాగంగా కోవూరు 403,కొడవలూరు 240, విడవలూరు 254, ఇందుకూరుపేట 304,బుచ్చిరెడ్డిపాళెం 218,బుచ్చిరెడ్డిపాళెం అర్బన్ 138 పెన్షన్లు పంపీణి చేసినట్లు తెలిపారు.దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సంక్షేమపథకాలను అమలు చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. పేదల పాలిట పెన్నిధిగా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రజల హృదయాలలో నిలిచిపోతారని అన్నారు.ఈ సందర్భంగా పెన్షన్లు పంపీణి చేశారు. వైకాపా సూళ్లూరుపేట పరిశీలకులు బాలచంద్రారెడ్డి ఆద్వర్యంలో మండలాల గ్రామ వాలింటరీలు కమీటి సభ్యులు వైకాపా నేతలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పరిశీలకులు బాలచంద్రరెడ్డి మాట్లాడుతు రాబోవు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని గ్రామ వాలింటరీలు,స్దానిక నేతలు,గృహసారధులతో సమైక్యంగా వ్యవహారించి ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని అన్నారు. అదే విధంగా తమతమ కుటుంబ సభ్యులతో సమన్వయం ఏర్పరచుకొని పనిచేయాలని అన్నారు. 2024 ఎన్నికలలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి గెలిపించుకోవాలని అదే విధంగా నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విజయపధంలో నిలపాలని కోరారు. స్దానిక వైకాపా నేతలు వాలింటరీలలో నూతన ఉత్సా హం నెలకొల్పారు. ముఖ్యమం త్రి చేస్తున్న అభివృద్దిని , స్దానిక ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సేవలను ప్రశంసించారు.వాలింటరీలు ప్రజలకు తెలియజేయాలని అన్నారు. 2024లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి,కోవూరు శాసనసభ్యులుగా నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విజయం సాధిస్తారని అన్నారు.వైకాపా నేతలు అభిమానులతో గంగపట్నం శివాలయం ప్రాంగణం కళకళలాడింది.ఈకార్యక్రమంలో మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి,డిఎల్‌డిఎ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్,దువ్వూరు కళా ్యణ్‌రెడ్డి, రజిత్‌కుమార్‌రెడ్డి, అదికారప్రతినిధి దండిగుంట పణీంద్రనాయుడు, అంబాల జనార్దన్‌రెడ్డి, శిబిరం సుబ్రమణ్యం,స్దానిక సర్పంచ్ సాయి నిరంజన్, జడ్‌పి వైస్ చైర్మన్ శ్రీహరికోట విజయలక్ష్మీ, బి . మధుసూదన్‌రెడ్డి,శ్రీనివాసులురెడ్డి,గూడూరు ప్రభాకర్‌రెడ్డి, రావూరు సర్పంచ్ వెంకటశేషయ్య,తహసిల్దారు సుబ్బయ్య, ఎంపిడిఒ కల్పన, ఎంఇఒ శ్రీహరిబాబు, వివిధ శాఖల అధికారులు నేతలు పాల్గోన్నారు.

## కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేత



**నెల్లూరుటౌన్, జనవరి 6, ప్రభాతవార్త:** ఆర్టీసీ నందు పని చేస్తూ మరణించిన ముగ్గురు ఉద్యోగుల కుటుంబ సభ్యులకు జిల్లా కలెక్టర్ వారి ఉత్తర్వుల ప్రకారము కారుణ్య నియామక పత్రాలను సాంఘిక సంక్షేమ శాఖ ఇన్‌చార్జ్ ఉప సంచాలకులు వై.వెంకటయ్య అందజేశారు. ఈ నియామకాలను సచివాలయముల నందు వెల్‌ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లుగా నియామక పత్రాలను జిల్లా ఎస్సీ సంక్షేమ మరియు సాధికారతా అధికారి వై.వెంకటయ్య అందజేశారు. ఉదయగిరి 1 సచివాలయానికి ఎ.వెంకటసుధీర్, బుచ్చిరెడ్డిపాళెం 2 సచివాలయానికి టి.సౌర్యప్రకాష్, ఇందుకూరుపేట బిట్ 2 సచివాలయానికి ఐ.ఉమాదేవిలను విధులు నిర్వహించాలని పేర్కొన్నారు.

## ఫ్రైడేని డ్రైడేగా పాటిద్దాం



**చేజర్ల,జనవరి6ప్రభాతవార్త:** శుక్రవారాన్ని డ్రైడేగా పాటించడం వలన దోమల ఉధ ృతిని తగ్గించుకొని అంటురోగాల బారినుంచి కాపాడుకోవచ్చని చేజర్ల, చిత్తలూరు డాక్టర్లు డాక్టర్ ఎస్.కె.మెహతాబ్, డాక్టర్ జ్యోతిలు పేర్కొన్నారు. చేజర్ల పిహెచ్‌సి పరిధిలో పెరుమాళ్ళపాడులోను , చిత్తలూరు పిహెచ్‌సి పరిధిలో ఆదూరుపల్లిలోను డాక్టర్లు సిబ్బందితో కలిసి అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదూరుపల్లిలో సర్పంచ్ చేవూరు నారాయణమ్మ, ఎంపిటిసి సభ్యులు పీర్ల పార్ధసారధి, వైసిపి మండల కన్వీనర్ తూమాటి విజయభాస్కర్‌రెడ్డిల ఆధ్వర్యంలోను , పెరుమాళ్ళపాడులో సర్పంచ్ తలపనేని నరసమ్మ, వైసిపి నాయకులు తలపనేని జయంతులునాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లో ఎక్కడబట్టినా జ్వరాల బారిన పడి అవస్థలు పడుతున్నారన్నారు. కీళ్ళు, కాళ్ళ నొప్పులతో ఆసుపత్రుల చుట్టూ కాళ్ళు అరిగేలా తిరుగుతున్నారన్నారు. చాలా గ్రామాల్లో ఇంటికి ఒకరు చొప్పున జ్వరాల బారిన పడి ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. దోమల ఉధృతివలన అంటువ్యాధులు ప్రబలుతున్నాయని , పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వలన దోమల ఉధృతి నుంచి కాపాడుకోవచ్చన్నారు. ఇళ్ళ సమీపంలో ఉన్న పాతటైర్లు, తాగిపడేసిన కొబ్బరి బోండాలు లేకుండా చూసుకోవడంతోపాటు పరిసరాల్లో నీళ్ళు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. మురుగుకాలువల్లో ఆయిల్‌బాల్స్ వేయడం వలన లార్వాను నాశనం చేస్తుందన్నారు. నీటిని నిల్వ ఉంచే తొట్టెల్లో లార్వా పెరిగి అంటురోగాలకు కారణమవుతుందన్నారు. వీటి నివారణకోసం ప్రతి శుక్రవారం నీటిని పూర్తిగా తీసివేసి ఆరబెట్టాలని వారు సూచించారు. డ్రైడేగా పాటించడం వలన లార్వా నశించి దోమల ఉధృతి తగ్గే అవకాశం ఉందన్నారు. ఈకార్యక్రమంలో సిహెచ్‌ఒ చంద్రయ్య, హెచ్‌వి సుప్రజ, ఎఎన్‌ఎం నీరజ, ఎంఎల్‌హెచ్‌పి శ్రీదివ్య, ఎఎన్‌ఎం రత్నకుమారి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## జీవోనెంబర్ 1 నిబంధనలు ప్రతి ఒక్కరికి వర్తిస్తాయి



**సంగం జనవరి 6 ప్రభాతవార్త:** జీవో నెంబర్ 1 నిబందనలు ప్రతి ఒక్కరికి వర్తిస్తాయని సంగం సిఐ రవినాయక్ తెలిపారు. నిబందన ప్రకారం రాష్ట్రంలో జాతీయ రహదారులలో,పట్టణ ప్రధాన వీధులలో ప్రజలకు ఇబ ్బంది కలిగించే ప్రాంతాలలో ఎటువంటి బహిరంగ సభలు సమావేశాలు నిర్వహించరాదని అన్నారు. ఇతర ప్రాంతాలలో సభలు సమావేశాలు పెట్టుకునే సమయంలో తప్పనిసరిగా జిల్లా ఎస్‌పి అనుమతి తీసుకోవాలని అన్నారు. అనుమతులు లేకుండా సభలు,సమావేశాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎస్ఐ నాగార్జునరెడ్డి ఉన్నారు.

## భోగి పండుగకు సిద్ధమవుతున్న పల్లెలు



**మనుబోలు, జనవరి 6 ప్రభాతవార్త** కొత్త సంవత్సరం ప్రారంభం కావడం, భోగి, సంక్రాంతి పండుగలు సమీపిస్తుండ టంతో పల్లెల్లో వాటి కొరకు జనాలు ఎదురు చూస్తున్నారు. భోగి, సంక్రాంతి పండుగలు జరుపుకునేందుకు పల్లె ప్రజలు సిద్ధమవుతున్నారు. ఇప్పుడు ఎక్కడ చూ సినా భోగి, సంక్రాంతి పండుగుల షా పింగ్‌లతో వ్యాపారాలు ఊపందుకున్నా యి. ఏడాదికి ఒకసారి వచ్చే ఈ పండు గలను ఘనంగా జరుపుకోవడం పల్లె ప్రజలకు ఆనవాయితీగా వస్తోంది. రైతు కుటుంబాలకు భోగి, సంక్రాంతి అతి ముఖ్యమైన పండుగలు. ఈసారి భోగి పండుగ శనివారం, పెద్ద పండుగ సంక్రాంతి ఆదివారం రావడం పెద్ద చిక్కు వచ్చింది. భోగి పండుగ రోజు మాంసాహారం తీసుకోవడం సర్వసాధారణం. ఆ పండుగ కాస్త శనివారం రావడంతో చాలా మంది శనివారం పూట మాంసాహారం తినరు. ఎప్పుడో ఏడేళ్ళకు ఒకసారి ఇలా జరుగుతుంది. మరో ఆరు రోజుల్లో భోగి పండుగ, సంక్రాంతి పండుగలకు గ్రామస్తులు స్వాగతం పలుకుతారు. వ్యవసాయంలో ఎంత బిజీగా వున్నా భోగి, సంక్రాంతి పండుగలు పల్లె ప్రజలు, రైతు కుటుంబాలు ఘనంగా జరుపుకుంటారు. దేశాల్లో వున్నా, ఇతర పట్టణాల్లో వున్నా సొంత గ్రామాలకు బంధువులు చేరుకుంటారు. దీంతో ఈ పండుగల నాలుగు రోజులు పల్లెలు కళకళలాడుతాయి. మహిళలు అరిసెలు,లడ్డూలు, జాంగ్రీలు, మైసూర్ పాక్‌లు చేస్తూ పండుగలకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. భోగి మంటలు వేసేందుకు పల్లెల్లో తాటాకులకు డిమాండ్ అయింది. పండుగలకు ముందు రోజు గతంలో తాటాకులు తెచ్చి వాటిని భోగి రోజు మంటలు వేసేవాళ్లు. ఇప్పుడు తాటాకుల తేవడం భోగి మంటలు వేయడం రెడీమేడ్‌గా మారింది. గత 20 ఏళ్ళ క్రితం పండుగలకు ఇప్పటి పండుగలకు చాలా వ్యత్యాసం కనిపిస్తోంది. సెల్ఫోన్ ప్రపంచం, వాట్సాప్ సందేశాలలో మునిగిన జనాలకు ఇప్పుడు భోగి, సంక్రాంతి పండుగలు రెడీమేడ్ అయ్యాయి. గంగిరెద్దులు, హరిదాసులు కానిరాని పల్లెలు పండుగలు నామమాత్రంగా జరుపుకుంటున్నారు. రెండేళ్ళ కరోనా అనంతరం వస్తున్న సంక్రాంతిని ఘనంగా జరుపుకోవాలని పల్లె ప్రజలు సకలం సిద్ధం చేస్తున్నారు.

## అర్హులందరికీ పింఛన్లు -దుష్ప్రచారం నమ్మొద్దు



**వలేటివారిపాలెం జనవరి 6, ప్రభాతవార్త** సామాజిక పింఛన్లు నిలుపుదల చేస్తున్నారన్న విపక్షాల వదం తులను నమ్మొద్దొని స్దానిక శాసనసభ్యులు ఎం.మహీధర్‌రెడ్డి అన్నారు శుకృవారం వలేటి వారిపాలెం మండల పరిషత్ ఆవరణలో ఎంపీడీవో రఫీక్ అహ్మద్ అధ్యక్షతన నూతన పింఛన్లు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమవిప్లవాన్ని సృష్టించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. మండలంలో 2019లో 5943మందికి పింఛన్లు ద్వారా రూ.1.41కోటి చెల్లిస్తుండగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఈ ఏడాది వరకు 6724మందికి రూ.1.82కోట్లు చెల్లిస్తున ్నట్లు వివరించారు. గతంలో పింఛను కోసం వృద్దులు పడిగాపులు కాయాల్సిన పరిస్దితి ఉండేదన్నారు. నేడు సూర్యోదయం ముందు నుంచే వాలంటీర్లు గడపగడపకు అందిస్తున్నట్లు తెలిపారు.లబ్దిదారులకు సకాలంలో పింఛన్లు అందించుటకు సచివాలయవ్యవస్ద వాలంటీర్ వ్యవస్దను సృష్టించినట్లు తెలిపారు. కొందరు పనిగట్టుకొని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. సంక్షేమానికి రారాజైన ముఖ్యమంత్రిజగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ మౌనిక, జెడ్పీటీసీ ఇంటూరి భారతి, ఎంపీడీవో రఫీక్ అహ్మద్, తహసిల్దార్ సుందరమ్మ తదితరులు మాట్లడారు. ఈ కార్యక్రమంలో ఏవో భరత్ కుమార్, హౌసింగు ఏఈ సిహెచ్ శ్రీనివాసులు, విద్యుత్ ఏఈ మధుబాబు,ఇన్‌చార్జి ఈవోఆర్డీ మాధవి,సర్పంచ్ డేగా వెంకటేశ్వర్లు,పంచాయతీ కార్యదర్శి రవికుమార్‌తో పాటు వైసీపీ సీనియర్ నేతలు ఇంటూరి హరిబాబు, పరి టాల వీరాస్వామి,అనుమోలు వెంకటేశ్వర్లు,కుంబాల క్రాంతికుమార్, ఇరపని అంజయ్య,నూకతోటి వీరనారా యణ,రోళ్లపాడు వేణుగోపాలరెడ్డి,సర్పంచ్‌లు ఇరపని సతీష్,ఓబులకొండయ్య, వింజం వెంకటేశ్వర్లు,పోకూరు డీలరు లింగాబత్తిన మాల్యాద్రి,బాపతు మాల కొండారెడ్డి, పెగడా వెంకటేశ్వర్లు,ఎల్లయిసీ మాల్యాద్రి,పరిటాల సింగయ్య చౌడబోయిన రమణయ్యతదితరులు ఉన్నారు.



## ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు



**బిట్రగుంట, జనవరి 6 ప్రభాతవార్త** బోగోలు మండలంలోని ప్రైవేట్ ఫెర్టిలైజర్స్ దుకాణాలలో ఎరువులు ఎమ్మార్పీ ధరలకన్నా అధిక ధరలకు విక్రయిస్తే ఎఫ్‌సివో 1987 యాక్ట్ ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ శాఖాధికారిణి ఎస్.విజయలక్ష్మి హెచ్చరించారు. మండలంలోని ఎస్‌జివి కండ్రికలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ ఇరిగేషన్ అగ్రికల్చర్ ట్రాన్స్‌ఫర్మేషన్ ట్రైనింగ్ ప్రాజెక్టు కింద పొలం బడి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆకుల కత్తిరింపు, పిలకల తొలగింపు ప్రయోగాలను ఆచరించి 45 రోజుల వరకు మొక్కకు పునరుత్పత్తి శక్తి వుందని కాబట్టి అవసర మేరకు పురుగు మందులు పిచికారి చేయాలని సూచించారు. జీవ నియంత్రణలో భాగంగా ట్రైకో కార్డుల వినియోగం, అంగార్షక విత్తన వాడకం గురించి తెలియజేశారు.

## టిడిపి నేత కుటుంబాన్ని పరామర్శించిన టిడిపి నేత అబ్దుల్ అజీజ్



**బిట్రగుంట, జనవరి 6 ప్రభాతవార్త** బోగోలు మండలం కోవూరుపల్లి గిరిజన కాలనీలో శుక్రవారం టిడిపికి చెందిన యాకసిరి చెంచయ్య సతీమణి సుజాతమ్మ మృతి చెందడంతో ఆమె మృతదేహాన్ని టిడిపి పార్లమెంటరీ అధ్యక్షులు ఎస్.కె.అబ్దుల్ అజీజ్, కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడులు సందర్శించి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వారి వెంట రాష్ట్ర పార్టీ కార్యదర్శి జెన్ని రమణయ్య,రాజానాయుడు, బోగోలు మండల పార్టీ అధ్యక్షులు యం.నాగేశ్వరరావు, ఇందుపూరు భాస్కర్‌రెడ్డి, ఎల్.సుధీర్‌బాబు, నాటకరాణి భాస్కర్, ఇందుపూరు తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

## రైలు పట్టాలపై గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం

**బిట్రగుంట, జనవరి 6 ప్రభాతవార్త** విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని కొడవలూరు-తలమంచి రైల్వే స్టేషన్ల మధ్య డౌన్‌లైన్‌లో కి.మీ.186/2-4 లైన్ల మధ్య గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాన్ని కనుగొన్నట్లు జిఆర్‌పి ఎస్ఐ అరుణకుమారి తెలియజేశారు. వృద్ధుడు ఏదైనా రైలులో నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లుగా తెలుస్తుందని తెలిపారు. ఆకుపచ్చ కలర్ ఫుల్‌హ్యాండ్స్ షర్ట్, తెలుపు గీతలతో, ఆకుపచ్చ బులుగు రంగు కల్గిన లుంగీ ధరించి వున్నాడని ఆమె పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## పంట నమోదు పరిశీలన



**కొడవలూరు జనవరి 6 ప్రభాతవార్త:** కొడవలూరు మండలంలోని, కొడవలూరు గ్రామంలో శుక్రవారం జిల్లా వ్యవసాయ అధికారి సుధాకర్‌రాజు వరి పొలాలు సందర్శించారు. మండలంలోని పంట నమోదు ప్రక్రియను వేగవంతంగా చేయాలనీ మరియు రైతులందరు విధిగా పంట నమోదు చేయించుకోవాలనీ సూచించారు. ఈ పంట నమోదు వివరాలు ప్రకారం ధాన్యం కొనుగోలు, పంట భీమా తదితర అంశాలు ఆధారపడి ఉంటాయనీ తెలిపారు. అనంతరం మండలంలోని యూరియా పంపిణీ స్థితిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఎవో సిహెచ్. లక్ష్మి, గ్రామ వ్యవసాయ సహాయకులు జి. కవిత, రైతులు పాల్గొన్నారు.

## నిరంజన్‌బాబురెడ్డికి అభినందనల వెల్లువ



**కోవూరు, జనవరి 6 ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ డి. నిరంజన్ బాబురెడ్డిని రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులుగా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు శుక్రవారం ఆయన కార్యాలయంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు నరసింహులురెడ్డి, రాష్ట్ర బొందిలి కార్పొరేషన్ చైర్మన్ కిషోర్‌సింగ్, కోఆప్షన్ సభ్యులు జుబేర్‌బాషా, గ్రామ సర్పంచ్ విజయ, పంచాయతీ కార్యదర్శి శివకుమార్ , వార్డు సభ్యులు అనూప్‌రెడ్డి, తదితరులు శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా ఆర్‌డబ్ల్యూ డీఈ లీలాప్రకాష్, జేఈ జగదీష్‌లు పుష్పగుచ్ఛంతో అభినందించారు.వైసీపీ నాయకులు చిరంజీవి, కె. మల్లికార్జున, కె. ప్రసాద్, శివకుమార్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, తదితరులు ఉన్నారు.

## జీవో నెంబర్ 1 రద్దు చేయాలి



**కోవూరు, జనవరి 6 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన జీవో నెంబర్1 ని రద్దు చేయాలని కోరుతూ కోవూరు మండల టీడీపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ ఎం. పద్మజకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి మాట్లాడుతూ చీకటి జీవోలను తీసుకువచ్చి ప్రతిపక్షాల గొంతు నొక్కడమే పనిగా ఈ ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. ఈ చట్టం కేవలం ప్రతిపక్షాలకేనా పాలక పార్టీలకు వర్తించదా అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాలరవి, ఎం. సుధాకర్, నాగకరాణి వెంకట్, మల్లికార్జున్‌రెడ్డి, సీహెచ్ మహేష్, రవీంద్రరెడ్డి, నాగేశ్వరరావు, విజయ్‌కుమార్, శ్రీనివాసులు, రమేష్‌యాదవ్, కృష్ణప్రసాద్, సింహాద్రి, నాగరాజు, తదితరులు ఉన్నారు.

## భూముల సర్వేకు రైతులు సహకరించాలి



**కోవూరు, జనవరి 6 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న భూహక్కు-భూసర్వేకు రైతులు పూర్తిగా సహకరించాలని తహసీల్దార్ ఎం. పద్మజ తెలిపారు. కోవూరు మండలం చెర్లోపాలెం గ్రామంలో డ్రోన్ ద్వారా సర్వే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సర్వే వలన భూముల సంబంధించిన వివరాలు పూర్తిగా తెలుసుకునేందుకు వీలు కలుగుతుందన్నారు. అంతకుముందు డ్రోన్‌కు సాంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు చేపట్టి దీనిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ప్రసాద్‌రెడ్డి, మండల సర్వేయర్ శ్రీనివాసులురెడ్డి, గ్రామ రెవెన్యూ అధికారి నాగేశ్వరరావు, గ్రామ సర్వేయర్లు ఉన్నారు.

## బ్రిడ్జి నిర్మాణం వెంటనే చేపట్టాలి



**కోవూరు, జనవరి 6 ప్రభాతవార్త :** కోవూరు చెరువు కట్ట సమీపంలోని కలుజు వద్ద బ్రిడ్జి నిర్మాణ చేపట్టాలని రాజకీయాలకు అతీతంగా బ్రిడ్జి నిర్మాణ సాధన పోరాట సమితి నిరసనలు శుక్రవారం మూడవ రోజుకు చేరుకున్నాయి. ఈ నిరసన దీక్షకు కోవూరు టీడీపీ, జనసేన, సీపీఎం, బీసీ సంఘాల నాయకులు పాల్గొని తమ సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటివరకు ఒక్క రోడ్డు కూడా మరమ్మతు చేసిన దాఖలాలు లేవన్నారు. సమస్యలపై స్పందించిన వారిపై ప్రభుత్వం కేసులు బనాయించే పరిస్థితిలో ఉన్నారన్నారు. ఈ ఉద్యమాన్ని జిల్లా స్థాయికి తీసుకెళ్లేలా ప్రజలు సహకరించాలన్నారు. జె. వెంకమరాజు, జి. శేషయ్య, మల్లారెడ్డి, పవన్‌కుమార్, బాలరవి, రమేష్, సురేంద్ర, అల్తాఫ్, బాబి, గోపాల్, రవి, ఖాలేషా, తన్మయ్, తదితరులు ఉన్నారు.

## ఎంపిడిఓ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్



**ఉదయగిరి జనవరి 6 ప్రభాతవార్త** ఉదయగిరి మండలంలోని ఎంపిడిఓ కార్యాలయంలో జిల్లా అడిషనల్ కమీషనర్ వీడియో కాన్ఫిరెన్స్ నిర్వహించారు. ఈకార్యక్రమానికి మండల పరిధిలోని ఇఒపిఆర్‌డి ,పంచాయితీ సెక్రటరీలు,విలేజి సర్వేయర్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంపిడిఒ ఐజాక్ ప్రవీణ్ సిబ్బందికి సూచనలు ఇస్తు అడిషనల్ కమీషనర్ ఇచ్చిన ఆదేశాలను అమలు పరస్తు గ్రామాలలో సమస్యలను పరిష్కరించాలని కోరారు.ఈకార్యక్రమంలో మండల అధికారులతోపాటు గాజుల ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.

## ఉదయగిరిలో బ్లాక్ లెవల్ క్రీడా పోటీలు



**ఉదయగిరి జనవరి 6ప్రభాతవార్త** ఉదయగిరి మండలంలోని ఎఆర్ఆర్ కాలేజి నందు నెహ్రు యువకేంద్ర జిల్లా అధికారి ఆకుల మహేంద్రరెడ్డిపినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆద్వర్యంలో ఉదయగిరి బ్లాక్ లెవల్ క్రీడా పోటీలు నిర్వహించారు.ఈ సందర్భంగా వాలిబాల్,కోకో,వంద మీటర్ల పరుగుపందెం,షాట్‌పుట్ పోటీలు నిర్వహించి పోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా మహేంద్రరెడ్డి మాట్లాడుతు చదువుతోపాటు ఆటాపాటలలో చురుకుగా ఉండడం వల్ల మానసిక ఉత్తేజంతోపాటు శారీరక అహ్లాదం కలుగుతుందని తెలిపారు.ప్రిన్సిఫల్ నరసింహారెడ్డి మాట్లాడుతు యువత చదువుతోపాటు ఆటపాటలలో కూడా గెలుపు ఓటములు తేడాలేకుండా చురుకుగా పాల్గొనాలని కోరారు.ఈకార్యక్రమంలో పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అద్యక్షులు కె మురళీమోహన్‌రాజు, ఫిజికల్ డైరక్టర్ ఎం.రమేష్,పి రాజు, ఒంకారం,శివసాయి కుమార్‌రాజు,క్రీడాకారులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు పాస్టర్ ప్రవీణ్‌కుమార్ దుప్పట్లు పంపిణీ



**కావలి రూరల్, జనవరి 6 ప్రభాతవార్త** కావలి మసునూరు దివ్యాంగుల కాలనీలో నివసిస్తున్న 50 మంది దివ్యాంగులకు శుక్రవారం పాస్టర్ ప్రవీణ్‌కుమార్, ఆయన భార్య దాతృత్వంతో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం దివ్యాంగుల కాలనీ అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ విభిన్నప్రతిభావంతుల రాష్ట్ర కార్యదర్శి మండవ వెంకట్రావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా మండవ వెంకట్రావు మాట్లాడారు. దివ్యాంగులు చలికాలంలో ఇబ్బందులు పడుతుండటంతో వారికి సేవ చేయాలనే ఉద్దేశంతో పాస్టర్ ప్రవీణ్‌కుమార్ దుప్పట్లు పంపిణీ చేసినందుకు దివ్యాంగులందరి తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని తెలిపారు. దివ్యాంగులకు ఏ చిన్న సహాయం చేసినా జీవితాంతం గుర్తు పెట్టుకుంటారని ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో దివ్యాంగులు సైలేష్, సోమయ్య, భాస్కర్, బాజీ, పోలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## లింపిస్కిన్ వ్యాధి నివారించేందుకు టీకాలు



**సైదాపురం, జనవరి 6, ప్రభాతవార్త:** పశువులకు లింపిస్కిన్ వ్యాధిని నివారించేందుకు టీకాలు అందజేస్తు న్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ సంచాలకులు మహేశ్వర్ తెలిపారు. సైదాపురంలోని పశు వైద్య కేంద్రాన్ని జిల్లా పశు సంవర్ధక శాఖ సంచాలకులు మహేశ్వర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇక్కడి పశు వైద్య కేంద్రం ద్వారా అందుతున్న సేవలపై ఆయన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింపిస్కిన్ వ్యాధిని నివారించేందుకు గాను 57 వేలకు పైగా తెల్ల పశువులకు టీకాలు అందిం చినట్లు ఆయన తెలిపారు. కొన్ని చోట్ల వేరే ప్రాంతాల నుంచి పశువులను కొనుగోలు చేసుకుని వచ్చిన వాటికి ఈ వ్యాధి ఉన్నట్లయితే తప్పకుండా సమీపంలోని పశు వైద్య కేంద్రంలో టీకాలు వేయించాలని సూచించారు. సంచార పశువైద్య సేవల కోసం నియోజకవర్గానికి ఒక వాహనాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల లోపు కాల్ సెంటర్‌కు ఫోన్ చేసినట్లు పక్క రోజున సంచార వాహనం ద్వారా సేవలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సేవలను పశు పోషకులు సద్విని యోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ పరిశీలనలో ఆయనతో పాటు ఆ శాఖ డీడీ సురేష్, పశు గణాభివృద్ధి సంస్థ ఈవో సోమయ్య, స్థానిక వైద్యాధికారి ప్రసాద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగుల వెన్ను విరుస్తున్న ప్రభుత్వం



**సీతారామపురం జనవరి 6 ప్రభా తవార్త** ఉదో్యగ ఉపాధ్యాయ సమ స్యలపై ప్రభుత్వంపై పోరాడే అభ్యర్థులకే పట్టుభద్రుల మొదటి ప్రా ధాన్యత ఓటు వేసి కప్పకం కట్టాలని నెల్లూరు, ప్రకాశం,చిత్తూరు, పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి అ భ్యర్ధి వెంకటేశ్వర్లురెడ్డి తెలిపారు. ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం స్దానిక యుటిఎఫ్ కార్యాలయంలో ఉపాధ్యాయులతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యా యుల వెన్ను విరిచే నిర్ణయాలు తీసుకుంటుందని దీనిని అరికట్టడానికి పీడిఎఫ్ అభ్యర్దులు శాసన మండలిలో ఉండాల్సి న అవసరం ఉందన్నారు.ఇప్పటికి రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధ్యాయులకు జీతాలు సైతం పడలేదంటే రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులపై ఎంత కక్ష సాధింపు చర్యలు చేపడుతుందో అర్ధం అవుతుందని అన్నారు. సిపిఎస్ రద్దు చేస్తామనిఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాన్ని తుంగలో తొక్కి కమీటిల ద్వారా కాలయాపన చేస్తున్న ఈ ప్రభుత్వానికి ప్రతిఒక్క పట్టభద్రుడు బుద్దిచెప్పాలని అన్నారు.ఉద్యోగుల పిఎఫ్ డబ్ల్యూ స్లిప్పుల రూపంలోనే కనిపిస్తున్నాయని,పిఎఫ్ నిదులు సైతం ప్రభుత్వం తన సొంత ప్రయోజనాలకు ఖర్చు చేసుకోవడం చాలా దుర్మార్గమైన చర్యగా ఆయన అభివర్ణించారు.ఈకార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి తిరపతయ్య,యుటిఎఫ్ అద్యక్ష ప్రధాన కార్యదర్శులు, గొడ్ల వీటి వెంకటేశ్వర్లు, ప్రతాప్,బి. శ్రీనివాసులు, టిసిఎం కొండయ్య, ఎ.ప్రసాద్, డి . వెంకటేశ్వర్లు,రంతుజాని, జయరామిరెడ్డి, ఎ.వి రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మానవాళికి రక్షణ ప్రకృతి వ్యవసాయం



**వింజమూరు,జనవరి6ప్రభాతవార్త:** ఆరోగ్య సంక్షోభం నుండి మానవాళిని సంపూర్ణంగా రక్షించగలిగేది ప్రకృతి వ్యవసాయమేనని రైతుసాధికారిత రాష్ట్ర కోఆర్డినేటర్ కర్నాటి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పలు పంచాయతీల్లో ప్రకృతి వ్యవసాయంపై అవగాహనా కార్యక్రమాన్ని స్థానిక వ్యవసాయాధికారులతో కలిసి నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం సాగు కష్టతరమైంది కాదన్నారు. అత్యధిక దిగుబడులు, అత్యధిక ఆదాయం కేవలం ప్రకృతి వ్యవసాయం ద్వారానే సాధ్యమవుతుందన్నారు. కరోనా సంక్షోభం తర్వాత ప్రస్తుత వ్యవసాయ రంగంలో ప్రకృతి వ్యవసాయం లాభసాటిగా ఉంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయం ఖర్చుతోకూడిందికాదన్నారు. ప్రస్తుత రసాయన వ్యవసాయం ద్వారా భూమిని మనిషి ప్రకృతిపరంగా చాలా బలహీన పరుస్తున్నారన్నారు. ఇది భూ సంక్షోభానికి దారి తీస్తుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌జగోన్మహన్‌రెడ్డి రైతులను అన్ని విధాలా ఆదుకునేందుకు వ్యవ సాయంలో లాభాలు పొందాలనే ఉద్దేశంతో ప్రకృతి వ్యవసాయం చేయాలని రైతులకు పెద్ద ఎత్తున రాయితీలు అందిస్తున్నా రన్నారు. వ్యవసాయంలో లాభాలు రావాలంటే ఒక్కపంటతో కాదని అంతర పంటలను, పలు పంటలను సాగుచేయాలన్నారు. భూమి అత్యధిక రసాయనిక విషపదార్థాలతో నింపడం వలన భూమి నిస్సారంగా మారిపోతుందన్నారు. అధిక ఖర్చుతో కూడిన వ్యవసాయం రైతు అప్పుల ఊబిలో దించుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయంలో పంటలు పండించి మంచి గిట్టుబాటుధరను పొందాలన్నారు .ఆర్‌వైఎస్‌ఎస్ జిల్లా ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎస్.మాలకొండయ్య, వింజమూరు వ్యవసాయ శాఖ సబ్‌డివిజన్ ఎడిఎ రామిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి



**వింజమూరు,జనవరి6ప్రభాతవార్త:** ఉదయగిరి నియోజకవర్గంలో వైఎస్ఆర్‌సిపి నాయకులు , కార్యకర్తలు సమన్వయంతో వైసిపి బలోపేతానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని ఉదయగిరి నియోజకవర్గ పరిశీలకులు కొడవలూరు ధనుంజయరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జడ్పీటిసి సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి, మండల పార్టీ మాజీ కన్వీనర్ గువ్వల కృష్ణారెడ్డి మరికొంత నాయకులతో సమావేశమై రానున్న 2024లో వైసిపి గెలుపుకు చేపట్టాల్సి న సూచనలు, సలహాలను నేతల నుండి స్వీకరించారు. అనంతరం ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో మరో వర్గం నేతలతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్మోహన్‌రెడ్డి పార్టీనాయకులకు, కార్యకర్తలకు ఇచ్చిన బాధ్యతలను పూర్తిస్థాయిలో నిర్వర్తిస్తూ ప్రజలకు సేవ చేయాలన్నారు . ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి కొద్దిరోజులు కరోనాతో అనేక సమస్యలను ప్రభుత్వం ఎదుర్కోవాల్సి న పరిస్థితి ఏర్పడిందన్నారు. వాటన్నింటిని అధిగమించి సంక్షేమం, అభివృద్ధిని పెద్ద ఎత్తున చేసుకుంటూ ప్రజల మన్ననలు పొందుతుందన్నారు. ఇటువంటి సమయంలో పార్టీ కొరకు నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాల్సి న అవసరం ఎంతైనా ఉందన్నారు. కొన్ని చోట్ల అంతర్గతంగా నేతలకు కొద్దిపాటి మనస్పర్ధలున్నప్పటికీ వాటిని పరిష్కరించుకునే విధంగా సరిద్దుకోవాలన్నారు. 2024ఎన్నికల్లో రాష్ట్రంలో 175స్థానాలకు 100శాతం విజయం సాధించాలన్నారు. ఇప్పటికే సీతారామపురం, వరికుంటపాడు మండలాల్లో నేతలతో సమావేశాలు నిర్వహించి పరిచయ కార్యక్రమాలను చేసుకు న్నామన్నారు.

శుక్రవారం వింజమూరులోని 5సచివాలయ పరిధిలోని నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించామని అందులో సూచించిన సమస్యల పరిష్కారానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఇనగనూరి మోహన్‌రెడ్డి, కన్వీనర్ రేవనూరి శ్రీనివాసులురెడ్డి, సొసైటీ చైర్మెన్ జూపల్లి రాజారావ్, సర్పంచ్ నల్లగొండ్ల సృజన, బుక్కాపురం సర్పంచ్ రసూల్, గుండెమడకల సర్పంచ్ పుల్లయ్య, నాయకులు మండాది గోవిందరెడ్డి, బండి కృష్ణారెడ్డి, కొండపల్లిరమేష్, బయపురెడ్డి విజయకృష్ణారెడ్డి, అన్నపురెడ్డి శ్రీనివాసులురెడ్డి, నీలం సంజీవరెడ్డి, మద్దూరు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, మద్దూరి చంద్రశేఖర్‌రెడ్డి, గణపం పెదమాలకొండారెడ్డి, రొడ్డా కొండయ్య, ఎనిమిరెడ్డి కొండలరెడ్డి , భోజనపుగోపి , మద్దూరి బాలకృష్ణారెడ్డి, చీమల హజరత్‌రెడ్డి, లెక్కల సుధాకర్‌రెడ్డి,తిరుపతయ్య , కనియంపాటి మురళి, ఇతర నేతలు పాల్గొన్నారు.

## ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన



**కావలి రూరల్, జనవరి 6 ప్రభాతవార్త** ప్రజా వైద్యులు, కావలి మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ ఎన్.ప్రభాకర్‌నాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక డాక్టర్ గుండెమడుగుల దేవదానం మెమోరియల్ హాస్పిటల్‌లో నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్ ప్రభాకర్‌నాయుడు తనయుడు ఎన్.సాయివర్ధన్ జన్మదినోత్సవం సం దర్భంగా ఈ మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్‌ను కట్‌చేశారు.అనం తరం జరిగిన వైద్యశిబిరంలో నెల్లూరు కిమ్స్ సూపర్ స్పెషాలిటీ వైద్యులు ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ ఎ.వి.రెడ్డి, గుండెవ్యాధి నిపుణులు డాక్టర్ సాహెబ్‌పీర్, న్యూరో సర్జన్ డాక్టర్ ఉదయ్ కిరణ్, నెఫ్రాలజిస్ట్ డాక్టర్ మస్తా న్‌వలి, గ్యాస్ట్రో సర్జన్ డాక్టర్ వంశీకృష్ణ, ఊపిరితిత్తుల వైద్య నిపుణులు డాక్టర్ శశిభరత్‌రెడ్డి, జనరల్, డయా బెటాలజిస్ట్ డాక్టర్ శ్రీహర్ష, చర్మ వ్యాధులు, కాస్మోటిక్ వైద్యులు డాక్టర్ మంజీర, డాక్టర్ గుండెమడుగుల దేవదానం వైద్యశాల గుండె వ్యాధుల నిపుణులు డాక్టర్ సుధీర్‌కుమార్, దంత వైద్య నిపుణులు డాక్టర్ వినయ్‌వినోద్‌బాబులు పాల్గొని 600 మందికి పరీక్షలు నిర్వహించి తగిన సలహాలు, సూచనలు అందజేశారు.అవసరమైన వారికి ఉచితంగా పరీక్షలు జరిపి మం దులు అందజేశారు. వచ్చిన వారికి భోజన వసతి కల్పించారు. ఈ వైద్యశిబిరంలో పాల్గొన్న వైద్యులకు డాక్టర్ ఎన్.ప్రభాకర్‌నాయుడు పూలబొకెలు అందజేసి దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ సంద ర్భంగా డాక్టర్ ఎన్.ప్రభాకర్‌నాయుడు మాట్లాడారు. నా కుమా రుడు ఎన్.సాయివర్ధన్ జన్మదినోత్సవం సందర్భంగా విచ్చేసిన డాక్టర్లు అందరికి ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటి వరకు 123 మెగా ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించడం జరిగిందన్నారు. కావలి, పరిసర ప్రాంత పేద,బడుగు, బలహీనవర్గాల ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించేందుకే మెగా ఉచిత వైద్యశిబిరాలు ఏర్పా టు చేయడం జరిగిందని తెలిపారు. ఈ వైద్యశిబిరానికి సేవలందించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలి పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హలిమా లాలి, డాక్టర్ అక్బర్‌బాషా, వైద్యశాల పిఆర్వో అక్కిలిగుంట ఆనంద రావు, సిబ్బంది పాల్గొన్నారు.

## జిఒనెంబర్ 1 నిబంధనలు ప్రతి ఒక్కరికి వర్తిస్తాయి - డియస్పీ



**ఆత్మకూరు,జనవరి6 ప్రభాతవార్త:** జిఒ నెంబర్1 నిబంధనలు రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికి వర్తిస్తాయని ఆత్మకూరు డియస్పీ కోటారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక డియస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిఒనెంబర్1 నిబంధనల ప్రకారం రాష్ట్రంలోని జాతీయ రహదారుల్లో, పట్టణ ప్రధాన వీధుల్లో ప్రజలకు ఇబ్బంది కలిగించే ప్రాంతాల్లో ఎటువంటి బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహించారదని, ఇతర ప్రాంతాల్లో సభలు, సమావేశాలు పెట్టుకునే సమయంలో తప్పనిసరిగా ఎస్పీగారి అనుమతి తీసుకోవాలన్నారు. సభలు, సమావేశాలకు పోలీసు రక్షణ ఏర్పాటు చేసే విధంగా మందస్తుగా అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. రానున్న సంక్రాంతి పండుగ సందర్భంగా నిషేధిత కోడిపందాలు, పేకాటలు, ఎర్రచందనం అక్రమరణవానా నిర్వహించిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామాన్నరు. డివిజన్ పరిధిలో ఎప్పటికప్పుడు శాంతిభద్రతల కోసం తమ పోలీస సిబ్బంది పూర్తిస్థాయిలో పనిచేస్తుందన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. న్యాయం కోసం ఏమసయంలో అయిన తమ పోలీసులను గానీ లేదా నేరుగా తతను గాని సంప్రదించవచ్చని డియస్పీ కోటారెడ్డి తెలిపారు .ఈసమావేశంలో స్థానిక ఎస్ఐ శివశంకర్‌రావ్, సిబ్బంది పాల్గొన్నారు .

## మానవత్వం చాటుకున్న పోలీసులు



**కొడవలూరు జనవరి 6 ప్రభాతవార్త:** వెంకటేశ్వరపురానికి చెందిన యానాదయ్య అనే 68 సంవత్సరాల వృద్ధుని రక్షించిన హైవే మొబైల్ పోలీసులు. వివరాల్లోకెళ్తే ఇంట్లో నుంచి అలిగి వెళ్లి గురువారం నార్త్‌రాజు పాలెం వద్ద గల పొలాలోని బురదలో పడిపోయి ఉన్న వృద్ధుని హైవే మొబైల్ పోలీస్ సిబ్బంది గుర్తించారు. వెంటనే వెంకటప్రసాద్, సుధాకర్ కానిస్టేబుల్స్ వృద్ధుని సమీపంలో ఉన్న అంజనేయ దేవాలయం వద్దకు తీసుకెళ్ళి, స్నానం చేయించి, బట్టలు వేసి, కోవూరు హాస్పిటల్ నందు ప్రధమిక చికిత్స చేయించి, వృద్ధుని కుటుంబ సభ్యులకు క్షేమంగా అప్పగించారు. అప్పగించినందుకు కుటుంబ సభ్యులు సంతోషంతో కానిస్టేబుల్స్‌కు కృతజ్ఞలు తెలిపార. వృద్ధుని ప్రాణాలు కాపాడిన మానవత్వం చాటుకున్న నెల్లూరు పోలీసులను వారి బంధుమిత్రులు, ప్రజలు అభినందనలు తెలియజేశారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా యస్‌సి సిహెచ్. విజయరావు హైవే మొబైల్ కానిస్టేబుల్స్ ఎల్ సుధాకర్, జి. వెంకటప్రసాద్‌లను ప్రశంసించి నగదు రివార్డ్ అందిచారు.

## ఘనంగా సహస్ర దీపాలంకరణ సేవ



**కోవూరు, జనవరి 6 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ పార్వతి సమేత మల్లికార్జునస్వామి దేవస్థానం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసి ఉన్న మండపంలో శివముక్కోటి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం పౌర్ణమి సందర్భంగా సహస్ర దీపాలంకరణ సేవ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పాల్గొని దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా అత్తిపల్లి వినోద్‌రెడ్డి, వారికుటుంబ సభ్యులు వ్యవహిరించారు. భక్తులందరికీ ప్రసాద వితరణ కార్యక్రమానికి ఉభయకర్తలుగా రామచంద్రారెడ్డి-సుగుణమ్మ దపంతులు, కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

## టిడిపి నేతలకు బెయిల్ మంజూరు



**కందుకూరు,జనవరి6,ప్రభాతవార్త** నెల్లూరు జిల్లా కందుకూరు తొక్కిసలాట దుర్ఘటనకు సంబంధించి నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు ,ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్‌ను గురువారం హైదరాబాద్‌లో కందుకూరు పోలీసులు అరెస్టు చేశారు.చంద్రబాబునాయుడు ర్యాలీలో 8మంది మృతి చెందిన సంఘటన తెలిసిందే.ఈ ఘటనకు సంబంధించి పోలీసులకు ఎవరూ ఫిర్యాదు చేయ లేదు.వారం తర్వాత కేసు నమోదు చేయడం సంచలనం కలిగించింది.సం బంధిత టిడిపినేతలు ర్యాలీ కోసం పోలీసుల అనుమతి తీసుకుని ఉన్నారు.ఈ ర్యాలీలో తొక్కిసలాట జరిగి ఆ పార్టీ కార్యకర్తలుమృతి చెందా రు.ఇది దేశ,రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించింది.ఎట్టకేలకు పోలీసులు 304సెక్షన్ కింద కేసునమోదుతో పాటు ఎస్సీ,ఎస్టీ ఎట్రాసిటీని కూడా వర్తింపచేశారు.హైదరాబాద్‌లో ఉంటున్న నాగేశ్వరరా వు,రా జేష్‌కార్యాలయాల్లోకి వెళ్లి అదుపులోకి తీసుకుని శుక్రవారం వేకువజామున కందుకూరు మెజిస్ట్రేట్ వద్ద హాజ రుపరిచారు.టిడిపి రాష్ట్ర లీగల్ సెల్ సభ్యులు,స్థానిక న్యాయవాదులు వాదనలు వినిపించారు.ఇరుపక్షాల వాధనలువిన్న మెజిస్ట్రేట్ 10వేల రూపాయల సొంత పూచి ఖర్చుతో వారిని విడుదల చేశారు.మాజీ శాసనసభ్యుడు దామచర్ల జనార్ధన్,పలువురు తెలుగుదేశం నేతలు మరుసటిరోజు వరకు వారి వద్ద ఉండి బెయిల్ మంజూరు వరకు కృషి చేశారు.ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ కక్షపూరితంగా అరెస్టు చేశారని విమర్శించారు.తప్పుడుకేసులు పెట్టారని ఆరోపించారు.తమను బెదిరించేందుకు ప్రభుత్వం ఇటువంటి పనులకు పాల్పడుతోందన్నారు.చివరకు న్యాయమే గెలిచిందని టిడిపి నేతలు పేర్కొన్నారు.

## రూ.2 లక్షల వ్యయంతో ఆలయ నిర్మాణ పనులు



**కోవూరు, జనవరి 6 ప్రభాతవార్త :** కోవూరు మండలం ఇనమడుగు కొత్త దళితవాడలో ఉన్న శివాలయంలో శుక్రవారం రెండు లక్షల వ్యయంతో ఆలయంలో చేపట్టనున్న మార్బుల్, టైల్స్ నిర్మాణ పనులను ప్రవాసాంధ్రులు వంశీధర్‌రెడ్డి ప్రత్యేకంగా చొరవ తీసుకుని పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి నెలాఖరులోగా మొత్తం ఈపనులను పూర్తిచేసేలా చర్యలు తీసుకోవడంజరుగు తుందన్నారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలే చేపట్టారు. శ్రీనివాసులు,జగన్, తదితరులు ఉన్నారు.

## సాంకేతిక నైపుణ్యాలపై మరింత అవగాహన పెంచుకోవాలి



**కోవూరు, జనవరి 6 ప్రభాతవార్త** : ఇంజనీరింగ్ రంగాల్లో వస్తున్న సాంకేతిక నైపుణ్యాలపై ఇంజనీరింగ్ విద్యార్థులు మరింత అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని కళాశాల కార్యదర్శి ఎన్. సుధాకర్‌రెడ్డి తెలిపారు. కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం సైబర్ సెక్యూరిటీ విభాగంపై ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ సెక్యూరిటీలో అనేక నూతన అంశాలు ఉన్నాయని, విద్యార్థులు వాటిని పూర్తిగా ఆకళింపు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పలు విభాగాల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పి. శ్రీనివాసులురెడ్డి, వై. విజయ్ శంకర్‌రెడ్డి, కళాశాల డైరెక్టర్ డాక్టర్ జి. సుబ్బారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ సందీప్‌కుమార్, ఏఈఎంఎల్ విభాగాధిపతి డాక్టర్ నాగేంద్రకుమార్, సైబర్ సెక్యూరిటీ విభాగాధిపతి డాక్టర్ సాయిప్రసాద్‌రెడ్డి, సీఎస్ఈ విభాగాధిపతి వి. గాయత్రి, పీఎం కిషోర్, తదితరులు ఉన్నారు. విద్యార్థులు చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు సభను అలరింపజేశాయి.

## డ్రైడే ఫ్రైడేలో పాల్గొన్న మేకపాటి



**ఉదయగిరి జనవరి 6 ప్రభాతవార్త** నియోజవకర్గ కేంద్రమైన ఉదయగిరిలో డ్రైడే ఫ్రైడేను అందరు బాగుండాలి అందులో మనం ఉండాలి అనే నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం కొనసాగిస్తున్నటువంటి కార్యక్ర మంలో ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేకర్‌రెడ్డి పాల్గొన్నారు.శుక్రవారం వైసిపి క్యాంపు కార్యాలయం నుండి ఉదయగిరి పారిశుద్ధ్య కార్మికులు,ఆశావాలింటరీలతో కలిసి డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది నుద్దేశించి ఎమ్మెల్యే మేకపాటి మాట్లాడుతు ప్రజలను వారి ఆరోగ్యాలను చూసుకునే బాధ్యత ఆశావర్కర్లదేనని ప్రభుత్వంలో వారి బాగస్వామ్యం వెలకట్టలేనిదని కొనియాడారు.ఈకార్య క్రమంలో మండల కన్వీనర్ అక్కి బాస్కర్‌రెడ్డి,వైస్ ప్రెసిడెంట్ ముత్తుజా, ఆశాకార్యకర్తలు,ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

## కావలి ఎమ్మెల్యే జమానాలో దళితులపై అరాచకాలు



**కావలి, జనవరి 6 ప్రభాతవార్త** జగన్మోహన్‌రెడ్డిని నమ్మి దళితులంతా ఓట్లు వేశారని అందుకు ప్రతిఫలంగా జగన్‌రెడ్డి పాలనలో దళితులపై అరాచకాలు జరుగుతున్నాయని టిడిపి రాష్ట్ర కార్యదర్శి జెన్ని రమణయ్య దుయ్యబట్టారు. కావలి టిడిపి కార్యాలయంలో ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జెన్ని రమణయ్య పాల్గొని మాట్లాడారు. రాష్ట్రమంతా ఒక ఎత్తయితే కావలి నియోజకవర్గంలో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఆయన అనుచరుల వేధింపులతో దళితులు అణగారిపోతున్నారని తెలిపారు. ఇటీవలకాలంలో దళితులు మునుసూరు కరుణాకర్, పైడి హర్ష, గోచిపాతల తేజలు అధికార పార్టీ నేతల అహంకారంతో బలైపోతున్నారన్నారు. మునుసూరు కరుణాకర్ ఎమ్మెల్యే వేధింపులకే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ఉత్తరం రాశాడన్నారు. మరో దళిత యువకుడు పైడి హర్షను వైసిపి పార్టీలో చేరనందుకు రౌడీషీట్ ఓపెన్ చేయడంతో పాటు ప్రతి నిత్యం దళిత పోలీస్ అధికారుల సహకారంతో వేధింపులకు గురిచేశారన్నారు. కావలి ఎమ్మెల్యే నివాసం వద్ద పురుగు మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడన్నారు. ప్రస్తుతం చెన్నై వైద్యశాలలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడన్నారు. ఈ రెండు సంఘటనల నుంచి కోలుకోకముందే గోచిపాతల తేజపై వైసిపి నేత చేసిన అరాచకాలు, అకృత్యాలు రాష్ట్ర వ్యాప్తంగా వైరల్ అయ్యాయన్నారు. కావలి నియోజకవర్గంలో దళితులపై జరుగుతున్న దాడులకు పాల్పడిన వ్యక్తుల్ని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, దళిత పోలీస్ అధికారులు కాపాడుతూ దళితులకు అన్యాయం చేస్తున్నారన్నారు. అందుచేత ఎస్సీ సెల్ రాష్ట్ర పిలుపు మేరకు ఈ నెల 10వ తేది 'చలో కావలి' పిలుపు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రజాస్వామ్యవాదులు, దళిత ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. చలో కావలి పిలుపును భగ్నం చేయాలని చూసినా, ముందస్తు అరెస్టులకు పాల్పడినా కావలి ఎమ్మెల్యేతో పాటు పోలీస్ అధికారులు బాధ్యత వహించాల్సి వస్తుందని జెన్ని రమణయ్య తీవ్ర స్థాయిలో హెచ్చరికలు చేశారు. జగన్‌రెడ్డి పాలనలో దళితులు అన్ని రంగాలలో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కక్ష సాధింపు దోరణలు పెరిగిపోయాయన్నారు. దళితులపై హత్యలు, మానభంగాలు, దాడులు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. రానున్న ఎన్నికలలో జగన్‌రెడ్డిని గద్దెదించుతామని హెచ్చరికలు చేశారు. ఈ సమావేశంలో టిడిపి పట్టణ ప్రధానకార్యదర్శి జ్యోతిబాబురావు మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం వల్ల దళితులు అధికారులుగా ఎదిగారన్నారు. అయితే కావలి నియోజకవర్గంలో అధికార పార్టీ నేతల కనుసైగల్లో దళిత పోలీస్ అధికారులు పనిచేస్తూ దళితుల అణిచివేతకు పాల్పడుతున్నారన్నారు. దళిత నేత పైడి హర్ష విషయంలో వైసిపి దళిత నేతలు అధికార పార్టీ నేతలకు తలొగ్గి బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు.ఈ దళితుల ఉసురు మీ బిడ్డలకు తగులుతుందని వైసిపి దళిత నేతలకు జ్యోతిబాబురావు తీవ్ర స్థాయిలో హెచ్చరికలు చేశారు. దళితులకు అండగా వుండి కాపాడాల్సిన దళిత సోదరులు విమర్శలకు పాల్పడటం, వారిని అవమానపరుస్తూ మాట్లాడటం బాధాకరంగా వుందన్నారు. పైడి హర్ష, గోచిపాతల తేజ సంఘటనలలో బాధ్యులైన వారందరిపై 307 కేసుతో పాటు అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కళాశాలలు, కళ్యాణమండపాల వద్ద గలాటాలు చేస్తే స్టేషన్ బెయిల్ ఇస్తారా అంటూ ఆయన ప్రశ్నించారు. పైడి హర్ష విషయంలో అవాకులు, చెవాకులు పేలుతున్న దళిత నేతలకు, వారి బిడ్డలకు హర్ష కుటుంబ సభ్యుల ఉసురు తగులుతుందని హెచ్చరికలు చేశారు. ఈ నెల 10వ తేది తలపెట్టిన చలో కావలి విజయవంతం చేసి ఈ నియోజకవర్గంలో దళితుల రక్షణకు పాటుపడాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆత్మకూరు నాగరాజు, పార్లమెంటు ఎస్సీ సెల్ అధ్యక్షులు కాకి ప్రసాద్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు దావులూరి దేవకుమార్, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దార్ల శివకుమార్, మండల పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు దాసు, పట్టణ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు అక్కిలిగుంట సూర్యప్రకాష్,ఎస్సీ నేతలు ఇనగంటి అనిల్, నేలపాటి మాల్యాద్రి, దాసరి మహేంద్ర, అజయ్, వేణు తదితరులు పాల్గొని మాట్లాడారు.

## వైభవంగా ఆరుద్ర నక్షత్ర అభిషేకం

**కోవూరు, జనవరి 6 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ పార్వతి సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో శివ ముక్కోటి పర్వదినం సందర్భంగా శుక్రవారం తెల్లవారుజామున స్వామి వారికి రుద్రాభిషేక పూజలను సాంప్రసదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాథం సుబ్బరామయ్య ఆధ్వర్యంలో చేపట్టారు. అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం వేకువజామునే జిల్లా వ్యవసాయ సలహ్రా మండలి చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, కోవూరు ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డిలు పూజలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా ఆస్ట్రేలియాలో నివాసముంటున్న సాయం కృష్ణచైతన్య, శ్రావణి దంపతులు వ్యవహరించారు. అనంతరం స్వామివారి ద్వార దర్శన కార్యక్రమాన్ని వైభవంఠ నిర్వహించారు. ఆలయ చైర్మన్ బి. సురేష్, ధర్మకర్తల మండలి సభ్యులు పి. మోహన్, ఏ. హనుమారెడ్డి, నాగరాజు, జగదీష్ స్వామి, సాయి యశ్వంత్‌రెడ్డి, భక్తులు ఉన్నారు.

## మహేష్‌నాయుడుపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలి



**కావలి, జనవరి 6 ప్రభాతవార్త** మహేష్‌నాయుడుపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని సిపిఐ(యంయల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కరవది భాస్కర్ డిమాండ్ చేశారు. అలాగే తేజను ఫోన్లో బెదిరించి, దాడికి ప్రోత్సాహం ఇచ్చిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన మీడియాతో మాట్లాడారు. దగదర్తి పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్న దళిత విద్యార్థి గోచిపాతల తేజపై విచక్షణారహితంగా దాడి చేసి, దుడ్డు కర్రతో చంపే ప్రయత్నం చేసిన మహేష్‌నాయుడుపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అధికార అహంకారంతో, కుల ఉన్మాదంతోనే దళిత విద్యార్థిపై అత్యంత పాశవికంగా దాడి జరిగిందన్నారు. మహేష్‌నాయుడు చేసిన దాడి దృశ్యాలు స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ కూడా పోలీసులు నిందితుడుని కాపాడడానికి కేసును నీరుగారుస్తున్నారన్నారు. అతనిపై ఎందుకు హత్యాయత్నం కేసు నమోదు చేయడం లేదని ప్రశ్నించారు. మహేష్‌నాయుడు దాడికి ముందు ఎస్ఐ కూడా మహేష్‌నాయుడు నీకు తెలియదంటావా అని తేజను ఫోన్లో బెదిరించడం వలనే పోలీస్ అండ చూసుకునే దాడికి తెగబడ్డాడని తెలిపారు. కావున తేజను ఫోన్లో బెదిరించిన ఎస్ఐపై కూడా కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళితులకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే దాడికి ప్రోత్సాహం ఇవ్వడం అత్యంత దారుణమన్నారు. కావలి నియోజకవర్గంలో అధికార పార్టీ అండదండలతో దళితులపై నిరంతరం దాడులు జరుగుతూనే వున్నాయన్నారు. దళితులు వైసిపికి ఓట్లేసిన పాపానికి దాడులు, హత్యలు బహుమతులుగా అధికార పార్టీ ఇస్తుందని దుయ్యబట్టారు. ఇప్పటికైనా అధికార పార్టీ దళితులపై దాడులకు స్వస్తి పలకాలని లేని పక్షంలో ఇదే దళితులు అధికార పార్టీని చెత్తబుట్టలోకి విసరడం ఖాయమన్నారు. కావలిలో శాంతిభద్రతలు విఘాతం కలగకుండా పనిచేయాల్సిన పోలీస్ వ్యవస్థ అధికార పార్టీకి పనిచేయడం సరికాదన్నారు. శాంతిభద్రతలు దిగజారితే అందుకు పోలీసులే కారణమవడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని అందువల్ల నిందితుల పట్ల కఠిన వైఖరి వుండాలని తెలిపారు.

## ట్రాన్స్‌పోర్టు, నాన్ ట్రాన్స్‌పోర్టు అన్ని ఇక కావలిలోనే



**కావలి, జనవరి 6 ప్రభాతవార్త** కావలి మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ కార్యాలయాన్ని అప్‌గ్రేడ్ చేస్తూ ఆర్టీవో కార్యాలయంగా మార్చారని నూతనంగా శుక్రవారం బాధ్యతలు చేపట్టిన ఆర్టీవో వై.సుధాకర్‌రెడ్డి తెలిపారు. కావలి ఆర్టీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో మోటార్ వెహికల్‌కు సంబంధించిన కొన్ని లైసెన్సులు, తదితర వాటి కోసం నెల్లూరులోని ఆర్టీవో కార్యాలయాన్ని సంప్రదించాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం కావలి కార్యాలయాన్ని అప్‌గ్రేడ్ చేస్తూ ఆర్టీవో పోస్టును కల్పించడంతో ఇక నుంచి ట్రాన్స్‌పోర్టు, నాన్ ట్రాన్స్‌పోర్టుకు సంబంధించిన లావాదేవీలన్ని కావలి కార్యాలయంలోనే జరుగుతాయన్నారు. విశాఖపట్నం, నెల్లూరు జిల్లా, ప్రకాశం జిల్లాల్లో పనిచేసి విశేష అనుభవం కల్గిన వై.సుధాకర్‌రెడ్డిని ఆర్టీవోగా నియమించడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. వాహనాల యజమానులకు ఎటువంటి అవసరాలు వున్నా కావలి ఆర్టీవో కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన కోరారు.ట్రాన్స్‌పోర్టు రంగంలో పెనుమార్పులు చోటుచేసుకున్నాయన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ఎంవిఐ కరుణాకర్ పాల్గొన్నారు.

## "ఎస్" క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మాజీమంత్రి అనిల్ కుమార్ యాదవ్



**నెల్లూరు,జనవరి6 ప్రభాతవార్త-విద్య** యాదవ ఎంప్లాయిస్ సొసైటీ(ఎస్) 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను మాజీ మంత్రి,ఎమ్మెల్యే పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్ శుక్రవారం నగరంలోని స్థానిక ఇస్కాన్‌సిటీలో గల ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతు సొసైటీ సభ్యులకు ఎటువంటి సమస్యలను వచ్చినా వాటి పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తామన్నారు. యాదవులు అందరూ కలిసి సొసైటీని స్థాపంచిన ఏకతాటిపైకి రావటం అభి నందనీయమన్నారు. అనంతరం సొసైటీ సభ్యులను ఆయనను గజమాలలతో,శాలువాలు కప్పిఘనంగా సత్కరించా రు.ఎంప్లాయిస్ సొసైటీ వ్యవస్థాపకులు డి.వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షులు సిహెచ్.ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాసులు, నాయకులు జి.శ్రీనివాసులు, కె.వాసు, బి.కోటేశ్వరరావు, పి.జగదీష్, పి.వెంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## జైనుల ర్యాలీకి జనసేన మద్దతు



**నెల్లూరు,జనవరి6 ప్రభాతవార్త-విద్య** జార్ఖండ్ శిఖర్జీని పున్యక్షేత్రంగా మార్చవద్దు అంటూ దేశవా ప్యంగా జైనులు చేపట్టిన ఆందోళణల్లో భాగంగా శు క్రవారం నగరంలోని స్థానిక బరకాస్ సెంటర్‌లో నిర్వహించిన జైనుల ర్యాలీలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ పాల్గొని పార్టీ తరపున మద్దతును వారికి ప్రకటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు జైన్ ధరమ్‌కీ నారాహై..శిఖర్జీ హమారాహై అంటూజైనులు ప్రభుత్వ తీరుకు నిరసనగా ర్యాలీలు ఆందోళనలు చేపడుతున్నారన్నారు. ఇందులో భాగంగా నేడు జైన్ మత పెద్దల ఆధ్వర్యంలో నగరంలో ర్యాలీ నిర్వ హించటం జరిగిందన్నారు. వారి దేవాలయ పవి త్రతను కాపాడుకునేందుకు జైనులు చేస్తున్న శాంతి యుత నిరసనలకు తమ పార్టీ మద్దతు ఎల్లప్పుడూ ఉం టుందని హామీ ఇచ్చారు. ఇతర మతాలకు, ఆచారాలకు బిన్నంగా జైనుల ఆహారవ్యవహారాలు ఉంటాయని, వీరిని ఇతరలుతో పోల్చి చూడటం సరికాదన్నారు. ఇంత కాలం నిశబ్ధంగా ఉన్న జైనులు వారి దేవుని కోసం ఆందోళన చేయటం చూస్తేనే ఇది వారికి ఎంత ముక్యమో అర్ధమౌతుందన్నారు. ప్రభుత్వం ఈ విషయంపై మరో మారు పునరాలోచించుకోవాలని కోరారు.ఈ మేరకు వినతిపత్రాన్ని జైన్ సంఘం నాయకులు కలెక్టర్ కార్యాలయసిబ్బందికి అందజేశారు. నాయకులు ప్రశాంత్ గౌడ్,నాని, కందర్, కుమార్‌జైన్, ప్రదీప్‌సింగ్,యువరాజ్ జైన్,ప్రవీన్, రమేష్,రాజు పాల్గొన్నారు.

## నూగు, మినుము పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



**కలిగిరి,జనవరి 6, ప్రభాతవార్త;** జిల్లాలోని శాస్త్రవేత్తలు శుక్రవారం కలిగిరి మండలంలో పర్యటించారు .మండల వ్యవసాయాధికారిసురేష్ ఆధ్వర్యంలో శాస్త్ర వేత్తలుమం డలంలోని వెలగపాడు, కావలిము స్తాపురం, కొత్తూరు, పెద్దకొండూరు, పెద్దపాడు, పోలంపాడు తదితర గ్రా మల్లోని పొలాల్ల పర్యటించి రైతు లు వేసినమినుము, శనగ,నూగు పంటలను పరిశీలించారు.ఈ సందర్భం గా అక్కడికి చేరిన రైతులకు మెట్టప్రాంతపంటలను గురించి పలు సూచనలు, సలహాలు అంద జేశారు.ఫైర్లువేసుకొనే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. అధికారులు సలహాలతో పైర్లు వేసుకుంటే అధిక లాబాలు వస్తాయంటూతెలియ జేశారు.కొత్తూరులో కొందరు రైతులు తాము శనగ పంటవేస్తే వర్షాలకు మొలకెత్తలేదని అదే స్థానంలో మరలా శనగ పంటకు శిద్ధపడుతున్నామనిశాస్త్రవేత్తల దృష్టికి తీసుకురాగా అలాచేస్తే కాలర్ రాక్ ఆశిస్తుం దన్నారు.వేరుపురుగు ఆశిస్తుందని దానికి బదులు నూగు పంట వేసుకోవాలని సలహాలుఅందజేశారు. అదేవిదంగా ప్రస్తుతం కొందరు మినుము పంట వేయడానికి శిద్ధపడ గా దానికింకా ఫిబ్రవరి 10నుండి సమ య మున్నందున ఇప్పుడువైయల్‌యం66,11,17,రకాల నూగును ఎకరాకు 1.5 కెజీల నూగులను రైతులు వేసు కోవాలని వింజమూరు ఎడిఎ రామిరెడ్డి తెలిపారు.

